బుధవారం
WEDNESDAY
25-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 146

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక



వైభవ్ సూర్యవంశీ ఊచకోత



16 బంతుల్లో యాభై..
28 బంతుల్లో వంద..
40 బంతుల్లో 150 దాటాడు..
52 బంతుల్లోనే డబుల్ సెంచరీ..
28 సిక్సర్లు.. 7 ఫోర్లు..
బౌండరీలతోనే 196 పరుగులు
53 బంతుల్లో 204 పరుగులు..
స్ట్రైక్ రేట్ 384.91

..ఇదీ వైభవ్ ఊచకోత

ఇంటర్ ప్రాక్టికల్స్ జంబ్లింగ్ రద్దు

సొంత కాలేజీల్లోనే రాసే వెసులుబాటు

తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్ణయం.. జనవరి 29 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



తెలంగాణలో 2027 ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం లేదని స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులు గతంలో మాదిరిగానే తాము చదువుతున్న సొంత జూనియర్ కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు.

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): ఇతర కళాశాలలకు కేంద్రాలను కేటాయించే విధానం ప్రస్తుతానికి ఉండదు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి అదనపు రుసుములు వసూలు చేస్తూ, సరైన ల్యాబ్ మూల్యాంకనం చేయకుండానే ప్రాక్టికల్స్‌లో పూర్తి మార్కులు (30కి 30) వేస్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో తరువాయి 2 వ పేజీలో...

రేవంత్ గురుదక్షిణ

కుప్పంకు పాలమూరు నీళ్లు

కేసీఆర్‌ను ఉరి తీయాలంటావా?.. తెలంగాణ కోసం పోరాడటం తప్పా?

కృష్ణా జలాలపై రేవంత్‌కు హరీశ్ కౌంటర్.. పల్నాడు, రాయలసీమ, పోతిరెడ్డిపాడుపై నిలదీత

299:512 ఒప్పందం తాత్కాలికమేనని వెల్లడి.. తెలంగాణ నీటి హక్కులపై చర్చకు సిద్ధమని సవాల్



కృష్ణా జలాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాల వరద పారిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన నీళ్లను ఎత్తిపోయాలని అడిగితే, సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్‌పై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. నిజాలను ఎంత వక్రీకరించినా అబద్ధాలు నిజాలు కావని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఒక్కొక్కటిగా సమాధానం ఇచ్చారు. పల్నాడు వాటర్ గ్రిడ్, కృష్ణా జలాల పంపిణీ, రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోతిరెడ్డిపాడు, సాగునీటి వినియోగంపై పలు పత్రాలు, జీవోలు, గతంలో రాసిన లేఖలను ప్రస్తావించారు. నీటి హక్కుల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో పోరాటాలు చేసిందని, కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

కేసీఆర్‌ను ఉరి తీయాలంటావా?

తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన కేసీఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి మాట్లాడటం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించడం తప్పా? ప్రాణాలను పణంగా పెట్టడం తప్పా? ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు రాజీనామాలు చేయడం తప్పా? గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాడటం తప్పా? అంటూ తరువాయి 2 వ పేజీలో...

ప్రియాన్ష్ ఆర్య పరుగుల మోత



18 బంతుల్లో యాభై..
36 బంతుల్లో వంద..
19 సిక్సర్ల మోత..
ఏడు ఫోర్ల వాత..
68 బంతుల్లో 181 పరుగుల పంట!
స్కోరులో రాహుల్‌ను దాటాడు..
సిక్సర్లలో ఫిన్ అలెన్‌ను అందుకున్నాడు!

..ఇదీ ప్రియాన్ష్ ఆర్య పరుగుల మోత

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

(గ్రాము-24 క్యారెట్స్):	రూ.12,656
వెండి (కిలో):	రూ.1,75,000
ప్లాటినం (గ్రాము):	రూ.3,890

విశ్వవాణి



క్యాన్సర్ చికిత్సలో శాస్త్రవేత్తలు మరో కీలక ముందడుగు వేశారు. అమెరికాలోని ఎంఐటీ, హార్వర్డ్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు క్యాన్సర్ కణాలపై దాడి చేస్తూనే, రోగి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకోగలిగేలా సహజ కిల్లర్ (ఎన్‌కే) కణాలను అభివృద్ధి చేశారు. క్యాన్సర్ కణాలపై ఉండే సీడీ19 గుర్తింపును లక్ష్యంగా చేసుకునేలా వీటికి ప్రత్యేకమైన కార్ రిసెప్టర్లను అమర్చారు. అలాగే, శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ వీటిని పరాయి కణాలుగా గుర్తించి నాశనం చేయకుండా హెచ్ఎల్ఏ క్లాస్-1 ప్రొటీన్ల ఉత్పత్తిని తగ్గించారు.

ఇందిరమ్మ టవర్స్‌కు రిజిస్ట్రేషన్ ఫ్రీ

హైదరాబాద్‌లో పేదలకు ఉచిత సేల్‌డీడ్

ఇందిరమ్మ టవర్స్‌కు టీజీ రేరా గుర్తింపు.. ఓఆర్ఆర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

హైదరాబాద్‌లో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇందిరమ్మ టవర్స్ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి దాదాపు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల విలువైన ఆస్తిని సమకూర్చడంతోపాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్ గృహ నిర్మాణ ప్రాజెక్టులకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రేరా) గుర్తింపు లభించిందని తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టులు తొలిసారిగా రేరాలో నమోదు కావడం ముఖ్యమైన పరిణామమని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పేదలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో లక్ష ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తరువాయి 2 వ పేజీలో...



గోదావరి పుష్కరాల లోగోకు రూ.1లక్ష

లోగో, ట్యాగ్‌లైన్ పోటీలు ప్రారంభం

ఎంట్రీలు పంపేందుకు నవంబర్ 30 వరకు గడువు

ప్లాస్టిక్ రహితంగా పుష్కరాల నిర్వహణకు ప్రణాళికలు

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): గోదావరి పుష్కరాలు-2027ను కుంభమేళా స్థాయిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ సన్నాహాలు -2 వ పేజీలో...

ఈసారి చిలకపచ్చ చీరలు

రేపు చీరల పంపిణీ ప్రారంభం.. అచ్చంపేటలో రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం



రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మహిళలకు 'ఇందిరమ్మ చీరల' పంపిణీ చేవట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలకు రామచిలుక రంగు (ప్యారెట్ గ్రీన్) చీరలను అందించనున్నారు.

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): ఆహార భద్రత లేదా రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని 18 ఏళ్లకు పైబడిన మహిళలను ఈ పథకానికి లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాలకు చెందిన 35 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తం కోటి చీరల్లో 6.30 మీటర్ల పొడవు కలిగిన పాలిస్టర్ చీరలు 95 లక్షలు కాగా, 9 మీటర్ల పొడవు ఉండే పాలీ-కాటన్ చీరలు 5 లక్షలు ఉన్నాయి. స్థానిక చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు సిరిసిల్ల తదితర ప్రాంతాల్లోని నేత కార్మికులకు చేతినిండా పని కల్పించే ఉద్దేశంతో ఈ చీరల తయారీ బాధ్యతలను వారికి అప్పగించారు. ఈ పంపిణీ ప్రక్రియను అత్యంత తరువాయి 2 వ పేజీలో...

తెలంగాణ పిల్లలు బక్కగున్నరు

దాదాపు సగం మందికి రక్తహీనత.. ఐసీఎంఆర్-నిన్ 'సంపద' జాతీయ సర్వేలో వెల్లడి



హైదరాబాద్‌కు చెందిన ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) తాజాగా విడుదల చేసిన 'సంపద' జాతీయ సర్వేలో తెలంగాణకు సంబంధించి ఆందోళనకర విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ఐదేళ్లలోపు చిన్నారుల్లో దాదాపు సగం మంది, పునరుత్పత్తి వయసులో ఉన్న మహిళల్లో సగానికి పైగా రక్తహీనతతో బాధపడుతున్నట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. 2023-25 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వే వివరాలను తాజాగా విడుదల చేశారు.

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): సర్వే గణాంకాల ప్రకారం.. తెలంగాణలో 12 నుంచి 59 నెలల వయసున్న చిన్నారుల్లో రక్తహీనత 47.4 శాతంగా ఉంది. ఇది జాతీయ సగటు (41.8%) కంటే ఎక్కువ కావడం గమనార్హం. పొరుగున ఉన్న కర్ణాటక (35.6%), తమిళనాడు (43.3%) కంటే తెలంగాణలో ఈ సమస్య అధికంగా ఉండగా, ఆంధ్రప్రదేశ్ (57.5%) కంటే మెరుగ్గా ఉంది. ఇక 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో 54% మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ విషయంలో జాతీయ సగటు (55.9%) కంటే తెలంగాణలో పరిస్థితి స్వల్పంగా మెరుగ్గా ఉంది. అయితే, కొన్ని వయసుల వారిలోతరువాయి 2 వ పేజీలో...

సముద్రంలో సెగలు

10 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత

ప్రపంచాన్ని వణికిస్తున్న మెగా ఎల్‌నినో.. పసిఫిక్‌లో ప్రమాద ఘంటికలు



న్యూఢిల్లీ: పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గాలాపగోస్ దీవులు, పెరూ తీరానికి సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఏకంగా 10 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే ఇందుకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మో, ఈ పరిణామాన్ని 'మెగా ఎల్ నినో'గా అభివర్ణించారు. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

25.11.2026

మేషం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలు కొంత మందకొడిగా సాగుతాయి.

వృషభం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావు. ఇంటా బయట కొందరి ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

మిథునం: బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారస్తులకు అధికారులతో చిన్నపాటి వివాదాలు కలగుతాయి.

కర్కాటకం: కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. పాత బాకీలు వసూలు అవుతాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయ పడతారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

సింహం: వ్యాపారాలలో నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. ముఖ్యమైన పనులలో తొందరపాటు మంచిది కాదు. నిరుద్యోగులకు కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇంటా బయట పని ఒత్తిడి అధికమై సమయానికి నిద్రహారాలు ఉండవు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు ధనపరంగా మాట ఇచ్చే విషయంలో కొంత ఆలోచించి ముందుకు సాగడం మంచిది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

తుల: వ్యాపార వ్యవహారాలు కొంత నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. నూతన కార్యక్రమాలు ప్రారంభించక పోవడం మంచిది. జీవిత భాగస్వామితో అకారణంగా మాటపట్టింపులు ఉంటాయి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఇంటా బయట మీ మాటకు విలువ తగ్గుతుంది.

వృశ్చికం: నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు అనుకూలించవు. వృధా ఖర్చుల విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఆశించిన ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు విస్తరించి నూతన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులు అధికారుల అండదండలతో నూతన అవకాశాలు పొందుతారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మకరం: నూతన ఋణ ప్రయత్నాలు చెయ్యకపోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధన పరంగా ఒడిదుడుకులు అధికమౌతాయి. దీర్ఘకాలిక ఋణాల ఒత్తిడి కొంత పెరుగుతుంది.

కుంభం: ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. మిత్రుల నుండి ఆశించిన ధన సహాయం పొందుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. కుటుంబ సమస్యలు రాజీ చేసుకుంటారు. ఉద్యోగమున ఆశించిన మార్పులు ఉంటాయి.

మీనం: ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలకు వెళ్ళకపోవడం మంచిది. వ్యాపారాల్లో నూతన విధానాలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. దూర ప్రయాణాలలో తొందరపాటు మంచిది కాదు.

రేవంత్ గురుదక్షిణ



మొదటి పేజీ తరువాయి

నిలదీశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే తప్పు అన్నట్లుగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి సమైక్యవాదుల పక్షాన ఉన్నారని ఆరోపించారు. ఉద్యమ సమయంలో పదవులకు రాజీనామాలు చేయకుండా జిరాక్స్ పత్రాలతో నాటకాలు ఆడారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన కొద్దికాలానికే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించారని, ఓటుకు నోటు వ్యవహారంలో పట్టుబడ్డారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణకు సాగునీరు అందని పరిస్థితులపై కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎందుకు పోరాడలేదని ప్రశ్నించారు. పాలమూరు ప్రజలు బొంబాయి, బొగ్గుబాయి, దుబాయికి వలసలు వెళ్లాల్సిన దుస్థితికి గత పాలకులే కారణమని ఆరోపించారు. మోటార్లు కాలిపోయి, బావులు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలోనే గులాబీ జెండా పుట్టిందన్నారు. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాడింది బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు.

తెలంగాణకు నీళ్లిచ్చింది కేసీఆర్ కాదా?

గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో సాగునీటి విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని హరీశ్‌రావు విమర్శించారు. నాగార్జునసాగర్ కుడికాల్వ నిర్వహణకు ప్రభుత్వ నిధులు ఖర్చు చేస్తూ, ఎడమకాల్వ నిర్వహణకు మాత్రం రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవారని గుర్తుచేశారు. ఈ వివక్షపై అప్పటి కాంగ్రెస్ మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కేసీఆర్ హాలియా నుంచి పాదయాత్ర చేపడతామని ప్రకటించిన తర్వాతే ఎడమకాల్వ నిర్వహణకు ప్రభుత్వ నిధులు కేటాయిస్తూ జీవో ఇచ్చారని తెలిపారు. జూరాల ఆయకట్టుకు గతంలో పది వేల ఎకరాలకు కూడా నీళ్లు అందేవి కావని, కేసీఆర్ పోరాటంతోనే ఆ పరిస్థితి మారిందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ సాగునీటి సౌకర్యాలు పెరిగాయని చెప్పారు. ఎస్సారెస్పీ పరిధిలో గతంలో ఐదు లక్షల ఎకరాలకు కూడా నీళ్లు అందని పరిస్థితి ఉండేదని, కేసీఆర్ హయాంలో తొమ్మిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల్లో గతంలో తుమ్మలు మొలిచేవని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు నీళ్లు చేరాయని తెలిపారు. గోదావరిపై ఎల్లంపల్లి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ వంటి ప్రాజెక్టులను నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు.

పాలమూరును పచ్చబరిచింది మేమే!

మహబూబ్‌నగర్ జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం సాగునీరు ఇవ్వలేదన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను హరీశ్‌రావు ఖండించారు. గత ముప్పై ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో పాలమూరుకు 30 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు అందించారని, బీఆర్ఎస్ హయాంలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చామని వివరించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా సాగునీటి సౌకర్యాలు పెంచామని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులపై మొత్తంగా రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కేసీఆర్ ప్రభుత్వం 75 శాతానికి పైగా పనులు పూర్తి చేసిందన్నారు. మూడో ప్యాకేజీలో మరో రెండు, మూడు కిలోమీటర్ల పనులు పూర్తి చేస్తే 50 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పనులను ముందుకు తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. పాలమూరులో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి సొంత ప్రాంతంలోని రైతులకు నీళ్లు అందించకుండా ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల విషయంలో మౌనంగా ఉంటున్నారని విమర్శించారు.

కుప్పంకు నీళ్లు.. పాలమూరుకు ఎందుకు లేవు?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుప్పం ప్రాంతానికి నీటిని తరలించేందుకు చేపట్టిన పనులపై తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెప్పడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం జీవో నంబర్లు 403, 405 జారీ చేసిందని, 2024 డిసెంబర్ 3న లైనింగ్ పనులకు సంబంధించిన జీవో వచ్చిందని పేర్కొన్నారు. 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పంకు నీళ్లు తీసుకెళ్తుంటే పాలమూరుకు మాత్రం నీళ్లు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. ఈ పనులను ఎందుకు అడ్డుకోలేదని ముఖ్యమంత్రిని నిలదీశారు. పాలమూరు రైతుల పరిస్థితి గురించి పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కొత్తగా 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని అసెంబ్లీలో పద్దులు ఆమోదింపజేశారని, అందులో కనీసం ఐదు శాతానికైనా నీళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇచ్చి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మూడేళ్లలో ఒక్క టీఎంసీ రిజర్వాయర్ కట్టారా?

కేసీఆర్ ప్రభుత్వం కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరణ కింద 47 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత కాంగ్రెస్ పదేళ్ల పాలనలో 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు అందించారని చెప్పారు. మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌లు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ వరి ఉత్పత్తిలో అగ్రస్థానానికి చేరిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 218 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను నిర్మించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌నైనా నిర్మించారా అని ప్రశ్నించారు. దేవాదుల, సీతారామ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను గత మూడేళ్లలో ఎన్ని రోజులు, ఎన్ని గంటలు నడిపారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగించుకోకుండా తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్, కాళేశ్వరం మూడో టీఎంసీ, సమ్మక్కసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయని, కొత్త ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి కొరతను ప్రస్తావిస్తూ ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పాలనలో వచ్చిన కరువని వ్యాఖ్యానించారు.

పల్నాడు ప్రాజెక్టుపై మాట మార్చిందెవరు?

పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాస్తవాలను వక్రీకరిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు 2025 జనవరిలోనే టెండర్లు పిలిచారని, అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. నవంబర్ 15, 16 తేదీల్లో పల్నాడు ప్రాజెక్టు వివరాలు బయటకు వచ్చాయని, 18న కేటీఆర్ ఆ అంశాన్ని ప్రస్తావించారని తెలిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం 16వ తేదీతో లేఖ రాసినట్లు చెబుతోందని, తేదీ మార్చి లేఖలు రాస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. పల్నాడు ప్రాజెక్టుకు సంబంధించిన 2022 జీవోలో నాగార్జునసాగర్ నుంచి నీళ్లు తీసుకుంటామనే ప్రస్తావన లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జారీ చేసిన జీవో నంబర్లు 453, 458లో మాత్రం నాగార్జునసాగర్ నుంచి నీటి తరలింపు అంశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా 458 జీవోలో నాగార్జునసాగర్ నుంచి 1.865 టీఎంసీల నీటిని తీసుకుంటామని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. గతంలో ఉన్న తాగునీటి వనరును నాగార్జునసాగర్‌కు మార్చాలని ఆ జీవోలో ఉందన్నారు. జీవో నంబర్ 482ను ముఖ్యమంత్రి ప్రస్తావించారని, వాస్తవానికి సంబంధిత జీవో నంబర్ 483 అని హరీశ్‌రావు చెప్పారు. అందులో ఒంగోలు బ్రాంచ్ కెనాల్ నుంచి నీటిని తీసుకునే విషయం ఉందన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో పల్నాడు ప్రాజెక్టుపై తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆరోపించారు. ఏపీ ఇంత పెద్ద ప్రాజెక్టు చేపడుతుంటే తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

299:512 ఒప్పందం తాత్కాలికమే!

కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు కేటాయించే తాత్కాలిక ఒప్పందానికి మూల కారణం గత ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ పాలకులేనని హరీశ్‌రావు ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీకే మొహంతి ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన వివరాల్లోనే తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజనకు సంబంధించిన పత్రాల్లో ఆ వివరాలను చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ ఏర్పడిన 42 రోజుల్లోనే కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి కృష్ణా జలాల్లో జరుగుతున్న అన్యాయంపై కేంద్రాన్ని నిలదీశారని తెలిపారు. అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతిని కలిసి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారని పేర్కొన్నారు. తెలంగాణకు 299 టీఎంసీలకు అదనంగా మరో 581 టీఎంసీలు అవసరమని కేసీఆర్ లేఖ రాశారని వివరించారు. 2015లో కుదిరిన 299:512 ఒప్పందం శాశ్వతం కాదని, ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు మాత్రమే అమలు చేసే తాత్కాలిక ఏర్పాటు అని స్పష్టం చేశారు. తెలంగాణ శాశ్వతంగా 299 టీఎంసీలకు అంగీకరించి ఉంటే కేసీఆర్ ట్రిబ్యునల్ కోసం ఎందుకు పోరాడేవారని ప్రశ్నించారు. ట్రిబ్యునల్ తుది అవార్డు వచ్చే వరకు కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో వినియోగించుకునేలా చూడాలని దాదాపు 30 లేఖలు రాసినట్లు తెలిపారు. కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లోనూ ఇదే డిమాండ్‌ను వినిపించామని చెప్పారు. 2021 ఆగస్టు, 2022 అక్టోబర్, డిసెంబర్ నెలల్లో కూడా నీటి వాటాలపై లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. 2020 తర్వాత తెలంగాణ జలాలపై శాశ్వత అంగీకారం ఇచ్చామని ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు.

రేవంత్ కూడా అదే ఒప్పందానికి అంగీకరించలేదా?

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తప్పుబడుతున్న రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 ఫిబ్రవరి 17న జరిగిన సమావేశంలో 299:512 తాత్కాలిక ఒప్పందాన్ని ఎందుకు కొనసాగించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి కూడా అదే ఏర్పాటును అంగీకరించారని పేర్కొన్నారు. తాత్కాలిక ఒప్పందాన్ని శాశ్వత ఒప్పందంగా చిత్రీకరించడం సరికాదన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ట్రిబ్యునల్ తీర్పుతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

సముద్రంలో సెగలు

మొదటి పేజీ తరువాయి

(ఈసీఎండబ్ల్యూఎఫ్) డేటా ఆధారంగా రూపొందించిన మ్యాప్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ఈ తీవ్రమైన వేడి పసిఫిక్‌లోని తూర్పు ప్రాంతంలోని ఒక హాట్‌స్పాట్‌కు మాత్రమే పరిమితమైందని, మొత్తం పసిఫిక్ మహాసముద్రం 10 డిగ్రీలు వేడెక్కిందని దీని అర్థం కాదని నిపుణులు వివరిస్తున్నారు. పసిఫిక్‌లోని విస్తృత మధ్య ప్రాంతాల్లో సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఎల్ నినో గణనీయంగా బలపడిందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) కూడా ధ్రువీకరించింది. 1950 నుంచి నమోదైన ఎల్ నినో రికార్డులను ఇది అధిగమించే అవకాశం 60% ఉందని ఎన్ఓఏఏ అంచనా వేస్తోంది. ముఖ్యంగా 1997–98, 2015–16 నాటి శక్తిమంతమైన ఎల్ నినోలను ఇది మించిపోవచ్చని పేర్కొంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. చరిత్రలో నమోదైన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఇది ఒకటిగా నిలవొచ్చని తెలిపింది. ఈ ఎల్ నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం ఉందని, దీనివల్ల రాబోయే నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంవో హెచ్చరించింది. ఎల్ నినో సమయంలో ఉష్ణమండల సముద్రంలో నిల్వ ఉన్న వేడి వాతావరణంలోకి విడుదల కావడమే ఇందుకు కారణమని వివరించింది. కాగా, గత అక్టోబర్‌లోనే పెరూ తీరం, గాలాపగోస్ పశ్చిమ జలాల్లో 6 నుంచి 7 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల కనిపించిందని యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ డేటా వెల్లడించింది.

ఇంటర్ ప్రాక్టికల్స్ జంబ్లింగ్ రద్దు

మొదటి పేజీ తరువాయి

పారదర్శకత తీసుకురావడానికి జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయాలనే ప్రతిపాదన వచ్చినప్పటికీ, 2027 పరీక్షలకు దీనిని అమలు చేయకూడదని బోర్డు నిర్ణయించింది. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ – 2027

ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి.

2027 జనవరి 29: మొదటి సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

2027 జనవరి 30: రెండో సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

2027 ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు: రెండో సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్

2027 ఫిబ్రవరి 11 నుంచి ఫిబ్రవరి 18 వరకు: మొదటి సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్



తెలంగాణ పిల్లలు బక్కగున్నరు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రదర్శన జాతీయ సగటు కంటే మెరుగ్గా ఉండటం ఊరటనిచ్చే అంశం. 5 నుంచి 9 ఏళ్ల పిల్లల్లో రక్తహీనత 23.8% (జాతీయ సగటు 31.3%)గా నమోదైంది. అలాగే, పురుషులు, వృద్ధుల విషయంలో తెలంగాణ మెరుగైన స్థానంలో ఉంది. 20 నుంచి 59 ఏళ్ల పురుషుల్లో రక్తహీనత కేవలం 12.5% మాత్రమే ఉండగా, జాతీయంగా ఇది 22 శాతంగా ఉంది. 60 ఏళ్లు పైబడిన పురుషుల్లో 28.6% (జాతీయ సగటు 44.7%), అదే వయసు మహిళల్లో 44.8% (జాతీయ సగటు 55.7%) మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేలింది. దేశవ్యాప్తంగా 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 183 జిల్లాల్లో ఈ సర్వే నిర్వహించారు. గతంలో వేలి నుంచి రక్తాన్ని తీసి చేసిన పరీక్షలకు భిన్నంగా, ఈసారి సిరల నుంచి రక్తాన్ని (వీనస్ బ్లడ్) సేకరించి ఆటోమేటెడ్ ఎనలైజర్ల ద్వారా పరీక్షలు జరిపారు. ఈ కొత్త పద్ధతి కారణంగా, పాత సర్వేల గణాంకాలతో ప్రస్తుత ఫలితాలను నేరుగా పోల్చవద్దని ఐసీఎంఆర్–నిన్ సూచించింది. మొత్తం మీద, చిన్నారులు, పునరుత్పత్తి వయసులో ఉన్న మహిళల్లో అధికంగా ఉన్న రక్తహీనత.. రాష్ట్రంలో పోషకాహారం, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరాన్ని సూచిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గోదావరి పుష్కరాల లోగోకు రూ.1 లక్ష

మొదటి పేజీ తరువాయి

ప్రారంభించింది. ఇందు లో భాగంగా పుష్కరాల విశిష్టతను చాటే అధికారిక లోగో.. ఆకర్షణీయమైన ట్యాగ్ లైన్ రూపకల్పన కోసం ప్రత్యేక పోటీలను ప్రకటించింది. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏ విశ్వవిద్యాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో పాటు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉత్తమ డిజైనర్లకు ప్రభుత్వం ఆకర్షణీయమైన నగదు పురస్కారాలను ప్రకటించింది. మొదటి బహుమతి కింద రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు అందజేయనున్నారు. కళాకారులు, విద్యార్థులు, డిజైనర్లతో పాటు సాధారణ ప్రజలు సైతం ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్నవారు తమ ఎంట్రీలను ఈ నెల 30వ తేదీలోపు పంపాల్సి ఉంటుంది. తెలంగాణ సంస్కృతి, గోదావరి నది పవిత్రత, ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా లోగో, ట్యాగ్‌లైన్‌లను తీర్చిదిద్దాలని నిపుణులు సూచించారు. ఎంపికైన లోగో, ట్యాగ్‌లైన్‌ను పుష్కరాల ప్రచారంలో అధికారికంగా విస్తృతంగా వినియోగించనున్నారు.

ఇందిరమ్మ టవర్స్‌కు రిజిస్ట్రేషన్ ఫ్రీ

మొదటి పేజీ తరువాయి

పొంగులేటి తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. తొలి దశలో మలక్‌పేట, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు టీజీ రేరా అనుమతులు లభించాయని చెప్పారు. మిగిలిన ప్రాజెక్టులను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఉచితంగా భూమి.. రిజిస్ట్రేషన్ కూడా!

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూమిని ప్రభుత్వమే ఉచితంగా సమకూరుస్తోందని మంత్రి తెలిపారు. అంతేకాకుండా ఫ్లాట్‌తోపాటు సంబంధిత భూమిలో లబ్ధిదారుడికి వచ్చే అవిభక్త వాటా (యూడీఎస్)ను కూడా వారి పేరిట నమోదు చేయనున్నట్లు వివరించారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు ఉచితంగా సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు విలువ చేసే ఆస్తిని పేదలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి స్పష్టం చేశారు. సామాన్యుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టులకు రేరా గుర్తింపు రావడంతో గృహ నిర్మాణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడం, లబ్ధిదారుల హక్కులను పరిరక్షించడం వంటి అంశాల్లో రేరా నమోదు కీలకమని పేర్కొన్నారు. మరోవైపు లబ్ధిదారులు తమ వాటా సొమ్ము చెల్లించేందుకు బ్యాంకుల నుంచి గృహ రుణాలు పొందడం కూడా సులభతరం అవుతుందని వివరించారు. రేరా గుర్తింపు ఉన్న ప్రాజెక్టులపై బ్యాంకులకు మరింత విశ్వాసం ఏర్పడుతుందని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఫ్లాట్లను అప్పగించడంతోపాటు ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

ఈసారి చిలకపచ్చ చీరలు

మొదటి పేజీ తరువాయి

పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. అర్హులైన మహిళలు తమ గ్రామాలు, వార్డుల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఆధార్ వివరాలను సమర్పించి చీరలను తీసుకోవచ్చు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నవంబర్ 19న ప్రారంభించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అనివార్య కారణాలతో నవంబర్ 26కు రీషెడ్యూల్ చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రుల పర్యవేక్షణలో ఈ పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొన

వాసవీ దేవి కుంభాభిషేకానికి ఆహ్వానం

ఎమ్మెల్సీ ఎల్. రమణకు ఆహ్వాన పత్రిక అందజేత

జగిత్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో డిసెంబర్ 2 నుంచి 6 వరకు నిర్వహించనున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి పునఃప్రతిష్ఠ, సపరివార దేవతా ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలకు ఎమ్మెల్సీ ఎల్. రమణను ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం ఆయనను కలిసి మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, ప్రతిష్ఠాపన కార్యక్రమాలు, కుంభాభిషేక మహోత్సవ విశిష్టతను ఎమ్మెల్సీకి వివరించారు. మహోత్సవాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ కోరుకంటి రాము, అల్లాల దామోదర్‌రావు, ఏలేటి సురేందర్‌రెడ్డి, కమటాల శ్రీనివాస్, చంద్రకాంత్, గంగిపెల్లి శేఖర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వుటూరి నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బోడ్ల జగదీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లాలో దొంగల హల్‌చల్

కోరుట్లలో ఆలయం.. మల్యాల క్రాస్‌రోడ్డులో మార్ట్‌లో చోరీ

బంగారం, వెండి, పంచలోహ విగ్రహాలు, నగదు అపహరణ

జగిత్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు జరిగాయి. కోరుట్ల పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై మల్యాల క్రాస్‌రోడ్డులోని మహా మార్ట్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కోరుట్ల పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఆలయంలోని రెండున్నర తులాల బంగారం, 30 గ్రాముల వెండి, పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లాడు. చోరీకి సంబంధించిన దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.

మహా మార్ట్‌లో రూ.25 వేల నగదు చోరీ

మల్యాల క్రాస్‌రోడ్డులోని మహా మార్ట్‌లో దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. మార్ట్‌లోని రూ. 25 వేల నగదుతోపాటు నిత్యావసర వస్తువులను ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నేటి నుంచి అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన

జగిత్యాల బాధితుల కోసం కరీంనగర్‌లో ప్రత్యేక కేంద్రం

రోజుకు 250 ఖాతాల పరిశీలన: ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): అగ్రిగోల్డ్ బాధితుల అసలు బాండ్లు, నగదు రసీదుల ధ్రువీకరణ ప్రక్రియ నవంబర్ 25 నుంచి ప్రారంభం కానుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన బాధితుల కోసం కరీంనగర్‌లోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 2027 ఫిబ్రవరి 2 వరకు మండలాల వారీగా ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతుందని, రోజుకు 250 ఖాతాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. బాధితులు తమ మండలానికి కేటాయించిన తేదీన అసలు బాండ్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫొటో, మొబైల్ నంబర్‌తో హాజరుకావాలని సూచించారు. అసలు బాండ్లను పరిశీలన కోసం మాత్రమే చూపించాలని, వాటిని అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బాధితులు ముందుగా తమ సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



డ్రగ్స్‌పై పోరుకు కిషన్‌రెడ్డి పాదయాత్ర

నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు

'నషా ముక్త భారత్' యాత్ర

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): యువతను మత్తుపదార్థాల బారి నుంచి కాపాడేందుకు హైదరాబాద్‌లో మూడు రోజులపాటు భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త భారత్' పేరుతో చేపట్టనున్న ఈ యాత్ర నవంబర్ 25న అంబర్‌పేట్‌లో ప్రారంభమై 27న జూబ్లీహిల్స్‌లో ముగియనుంది. నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా దాదాపు 30 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కిషన్‌రెడ్డి వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. దేశ యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో డ్రగ్స్ ఒకటిగా మారాయని కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మత్తుపదార్థాలకు అలవాటుపడి అనేకమంది యువకులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, ఈ పరిస్థితిని అడ్డుకోవాలంటే సమాజమంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పంజాబ్‌లో మత్తుపదార్థాల సమస్య తీవ్రంగా ఉందని, అలాంటి పరిస్థితులు ఇతర రాష్ట్రాలకు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2029 నాటికి దేశాన్ని మత్తుపదార్థ రహిత సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక పాదయాత్రకు సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు మద్దతు ప్రకటించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచేందుకు చేపడుతున్న ఈ యాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లలో కమీషన్ల దందా!

మంత్రి సొంత గ్రామంలోనే

రూ.10 వేల వసూళ్ల ఆరోపణలు

విధుల్లో చేరిన రెండు

నెలల్లోనే ఏజెంట్ల వ్యవస్థ?

ముడుపులు ఇవ్వకుంటే బిల్లులు

ఆపేస్తామంటూ బెదిరింపులు!

హౌసింగ్ అధికారిపై విచారణ

జరిపించాలని బాధితుల డిమాండ్

కాటారం, నవంబర్ 24 (ఈవార్తలు): నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కొందరు అధికారులు, దళారులకు కాసుల పంటగా మారుతోందా? ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయం కోసం పేదలు కమీషన్లు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందా? బిల్లులు మంజూరు కావాలంటే ముడుపులు ఇవ్వాల్సిందేనంటూ లబ్ధిదారులను బెదిరిస్తున్నారా? జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఓ హౌసింగ్ అధికారి వ్యవహారంపై వినిపిస్తున్న ఆరోపణలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. విధుల్లో చేరిన కొద్ది నెలల్లోనే గ్రామగ్రామాన ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది.

అధికారి పేరు చెప్పి వసూళ్లు!

కాటారం మండలంలోని పలు గ్రామాల్లో హౌసింగ్ అధికారి పేరు చెప్పుకుంటూ కొందరు వ్యక్తులు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ. 2,500 నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇలా వసూలు చేసిన డబ్బులను సంబంధిత అధికారికి చేరవేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి సొంత గ్రామంలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి రూ. 10 వేల చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు సంచలనంగా మారాయి. కొత్తపల్లి, ధన్వాడ, శంకరంపల్లి, దేవరంపల్లి తదితర గ్రామాల్లో ఈ వసూళ్ల వ్యవహారం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్న పేదలు కూడా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు మంజూరు కావాలంటే ఏజెంట్లను సంప్రదించాల్సిందేనంటూ లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తులు అడిగిన మొత్తం చెల్లిస్తేనే బిల్లుల ప్రక్రియ ముందుకు సాగుతుందని చెబుతున్నట్లు సమాచారం. ముడుపులు ఇవ్వని లబ్ధిదారుల బిల్లులను నిలిపివేస్తామని, ఇంటి నిర్మాణ పనులకు ఇబ్బందులు కల్పిస్తామని బెదిరిస్తున్నారనే వాదనలు ఉన్నాయి. ఇప్పటికే అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పేదలు ఈ వసూళ్లతో మరింత ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. తమకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ వ్యవస్థలోనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పేదల సొంతింటి కలపై అవినీతి రాబందుల కన్ను!

రెండు నెలల్లోనే ఏజెంట్ల వ్యవస్థ?

సంబంధిత హౌసింగ్ అధికారి విధుల్లో చేరిన కొద్ది నెలల వ్యవధిలోనే గ్రామాల్లో మధ్యవర్తుల వ్యవస్థ ఏర్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకంగా జరగాల్సిన బిల్లుల మంజూరు ప్రక్రియ ఏజెంట్ల చేతుల్లోకి వెళ్లిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు, లబ్ధిదారుల వివరాలు, చెల్లింపుల ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయం ఎంతవరకు ఉందనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసూళ్ల వెనుక ఎవరున్నారు? డబ్బులు ఎవరికి చేరుతున్నాయి? లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలకు ఆధారాలున్నాయా? అనే అంశాలను విచారణలో తేల్చాలని బాధితులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి చెడ్డపేరు తెస్తున్న ఈ వ్యవహారంపై సంబంధిత రాష్ట్ర మంత్రి వెంటనే స్పందించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. హౌసింగ్ అధికారిపై వచ్చిన ఆరోపణలను ఉన్నతాధికారులతో విచారణ చేయించాలని కోరుతున్నారు. వసూళ్లకు పాల్పడినట్లు తేలితే సంబంధిత అధికారి, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు రావాల్సిన బిల్లులను ఎలాంటి ముడుపులు లేకుండా మంజూరు చేయాలని కోరుతున్నారు. పేదల ఇళ్ల నిర్మాణంలో కమీషన్ల వ్యవహారానికి అడ్డుకట్ట పడుతుందా? బాధితుల ఆరోపణలపై అధికారులు విచారణ చేపడతారా? అన్నది స్థానికంగా చర్చనీయాంశమైంది.

కవితపై మాట దొర్లింది.. విచారిస్తున్నా!

తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన మంత్రి సీతక్క

కావాలని అనలేదని స్పష్టీకరణ.. వీడియో విడుదల

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఉద్దేశించి మాట్లాడిన సమయంలో పొరపాటున ఓ పదం దొర్లిందని రాష్ట్ర మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. ఆ వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కావాలని ఎవరినీ కించపరిచే ఉద్దేశంతో ఆ మాట అనలేదని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక వీడియో విడుదల చేశారు. సోమవారం ములుగులో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడే సమయంలో కవిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించానని సీతక్క తెలిపారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో తన ఆరోగ్య పరిస్థితిపై కవిత వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించే క్రమంలో పొరపాటున ఒక పదం ఉపయోగించినట్లు చెప్పారు. ఆ మాట ఉద్దేశపూర్వకంగా అనలేదని, వెంటనే సరిదిద్దుకుని వెనక్కి తీసుకున్నానని వివరించారు. తాను వెంటనే వ్యాఖ్యలను సరిదిద్దుకున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు ఆ వీడియోను కావాలనే సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని సీతక్క మండిపడ్డారు. తనపై ట్రోలింగ్ చేస్తూ తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. వరంగల్ పర్యటనలో పింఛన్ల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తాను గట్టిగా తిప్పికొట్టానని, ఆ అక్కసుతోనే తన మాటలను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను ఎప్పుడూ సిద్ధాంతపరంగా, రాజకీయంగానే ఎదుర్కొంటానని సీతక్క స్పష్టం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేయడం తన నైజం కాదని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. కవితను ఉద్దేశించి పొరపాటున దొర్లిన మాటపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు మరోసారి తెలిపారు.



సెప్టిక్ ట్యాంక్‌లో ముగ్గురు కార్మికుల మృతి!

బాచుపల్లి అపార్ట్‌మెంట్‌లో విషాదం

క్లీనింగ్‌కు దిగిన యువకులను

బలిగొన్న విషవాయువులు

మృతులంతా శ్రీకాకుళం జిల్లా వాసులే

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ముగ్గురు యువకులను సెప్టిక్ ట్యాంక్ మృత్యుకుహరంగా మార్చింది. అపార్ట్‌మెంట్‌లోని సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు విషవాయువుల బారినపడి ప్రాణాలు కోల్పోయారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏపీఆర్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతులంతా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. మృతులను పవన్ యల్లా (20), కె.షణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ (24)గా గుర్తించారు. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఈ ముగ్గురు సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనుల్లో ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్ యాజమాన్య సంఘం సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనుల కోసం హెచ్‌ఆర్ ఇన్ఫిరో అనే ప్రైవేటు కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా సంస్థ సిబ్బంది అపార్ట్‌మెంట్‌లో క్లీనింగ్ పనులు నిర్వహిస్తున్నారు. మంగళవారం సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు వచ్చిన ముగ్గురు కార్మికులు ఒకరి తర్వాత మరొకరు ట్యాంక్‌లోకి దిగారు. అయితే లోపల ప్రమాదకరమైన విషవా యువులు పేరుకుపోయి ఉండటంతో వాటిని పీల్చి ఊపిరాడక స్పృహతప్పి పడిపోయినట్లు సమా చారం. ఎంతసేపటికీ ముగ్గురూ బయటకు రాకపో వడంతో తోటి సిబ్బంది, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసు లకు, అత్యవసర సహాయక బృందాలకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న హైడ్రా ఎస్ఎఫ్‌వో శ్రీనివాస్ నేతృత్వంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సెప్టిక్ ట్యాంక్ లోపల విషవాయువులు అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టారు. పాతాళకాంత వంటి ప్రత్యేక రెస్క్యూ పరికరాలను ఉపయోగించి ముగ్గురు కార్మికుల మృతదేహాలను ట్యాంక్ నుంచి బయటకు తీశారు.



భద్రతా చర్యలు పాటించారా?

సెప్టిక్ ట్యాంక్‌లో పేరుకుపోయిన విషవాయువులు పీల్చడంతో ఊపిరాడక కార్మికులు మృతి చెందినట్లు అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు అపార్ట్‌మెంట్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనుల్లో అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించారా? కార్మికులకు తగిన రక్షణ పరికరాలు అందించారా? అనే అంశాలపై విచారణ చేపట్టారు. ముగ్గురు యువకులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



తెలంగాణ బ్రాండ్ పెంచేలా గ్లోబల్ సమ్మిట్

భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లను

పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు

డిసెంబర్ 7 నుంచి 9 వరకు అంతర్జాతీయ సదస్సు

1,500 మందికి పైగా సీఈవోలు, పెట్టుబడిదారులు,

దౌత్యవేత్తలకు ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రపంచ దేశాలకు తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక సామర్థ్యాన్ని చాటిచెప్పేందుకు ఈ సదస్సు కీలక వేదిక కానుందని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజులపాటు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా 1,500 మందికి పైగా సీఈవోలు, పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సమ్మిట్ వేదిక నిర్మాణం, ఎక్స్‌పో జోన్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, అతిథుల వసతి వంటి అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు అధికారులతో సమీక్షించారు. అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ఉండాలని, చివరి సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులు, ప్రభుత్వ విధానాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులకు వివరించనున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో డిఫెన్స్, ఫార్మా, గేమింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాలకు చెందిన వెయ్యికి పైగా కంపెనీలు పాల్గొనేలా మల్టీసెక్టార్ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల భద్రత కోసం ఫేషియల్ రికగ్నిషన్ వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా పరిచయం చేసేలా సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.



గురునానక్ కీర్తనలతో మార్మోగిన నాంపల్లి

వైభవంగా గురునానక్ 557వ జయంతి వేడుకలు

దేశ రక్షణలో సిక్కుల త్యాగాలు మరువలేనివి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వేలాది మందితో విశాల్ దీవాన్.. నిర్విరామంగా లంగర్

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): దేశ రక్షణలో సిక్కులు కీలక పాత్ర పోషిస్తున్నారని, దేశం కోసం వారు చేసిన త్యాగాలు మరువలేనివని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అన్నారు. గురునానక్ దేవ్‌జీ మహారాజ్ 557వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 'విశాల్ దీవాన్' (కీర్తన్ దర్బార్) కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అశోక్‌బజార్ గురుద్వారా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సర్దార్ గురుచరణ్‌సింగ్ బగ్గా, సికింద్రాబాద్ గురుద్వారా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సర్దార్ కుల్దీప్‌సింగ్ సలూజా సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై సామూహిక కీర్తన్ దర్బార్‌లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సిక్కుల సేవలు ప్రశంసనీయం

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, రామచంద్రరావు మాట్లాడుతూ దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ కోసం ఎంతోమంది సిక్కులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. సరిహద్దుల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సిక్కు సైనికులు దేశ రక్షణలో నిమగ్నమవుతున్నారని పేర్కొన్నారు. దేశానికి వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. గురునానక్ జయంతి సందర్భంగా భారీ స్థాయిలో కీర్తన్ దర్బార్ నిర్వహించి సిక్కుల ఐక్యతను చాటడం అభినందనీయమని తెలిపారు. ఉదయం ప్రారంభమైన కీర్తన్ దర్బార్ సాయంత్రం ఆరు గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. మత గురువులు ఆలపించిన షాబాద్ కీర్తనలు, గురునానక్ ప్రవచనాలతో ఎగ్జిబిషన్ మైదానం మార్మోగింది. వేలాది మంది భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ లంగర్ (అన్నదానం) కార్యక్రమాన్ని అతిథులు సందర్శించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు సిక్కు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.

కిషన్‌రెడ్డికి తల్వార్ బహూకరణ

గురుద్వారాల్లో విశిష్ట సేవలందించిన పలువురిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సంప్రదాయ తల్వార్‌ను బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సర్దార్ జోగేంద్రసింగ్ చావ్లా, సర్దార్ రణ్‌బీర్‌సింగ్ గాంధీ, తరన్‌దీప్‌సింగ్ భాటియా, మీడియా ఇన్‌చార్జి సర్దార్ సత్నాంసింగ్, జస్పాల్‌సింగ్ ఖతేజా, మంజీత్‌సింగ్ పాలా, గురుదీప్‌సింగ్, రవీందర్‌సింగ్ సర్నా, జగదీప్‌సింగ్ ఖతేజాతోపాటు వేలాది మంది సిక్కులు, మహిళలు, యువత పాల్గొన్నారు.



కొండగట్టులో భక్తుల అవస్థలు!

అంజన్న నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు

క్యూలైన్లలో తోపులాట.. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు

రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయలేదని భక్తుల ఆగ్రహం

మల్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): కార్తీక పౌర్ణమి వేళ కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కార్తీకమాసం, గిరి ప్రదక్షిణ, స్వామివారి నిజరూప దర్శనం నేపథ్యంలో జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టుకు భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు లేకపోవడంతో దర్శన క్యూలైన్లలో ఓ దశలో తోపులాట చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కొండగట్టుకు తరలివచ్చారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నిజరూప దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

మహిళలు, వృద్ధులకు తప్పని తిప్పలు

దర్శన క్యూలైన్లలో తీవ్ర రద్దీ నెలకొనడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్తీక పౌర్ణమితోపాటు నిజరూప దర్శనం నేపథ్యంలో భక్తులు భారీగా తరలివస్తారని తెలిసినా ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో ఆలయ యంత్రాంగం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం, భద్రతా సిబ్బంది నియామకం, రద్దీ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నిజరూప దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యపై ముందస్తు అంచనా లేదా? భక్తుల భద్రతపై ఆలయ అధికారులకు బాధ్యత లేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, తోపులాట ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

తులసి పూజలతో భక్తి శోభ

భీమేశ్వరాలయంలో కార్తీక దీపారాధన

మహిళల ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక సందడి

వేములవాడ అర్బన్, నవంబర్ 24 (ఈవార్తలు): కార్తీక పౌర్ణమి సందర్భంగా వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో తులసి పూజలు, దీపారాధనలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని తులసి మొక్కల వద్ద మహిళలు దీపాలు వెలిగించి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. తమ కుటుంబాలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. పలువురు మహిళలు తమ ఇళ్ల వద్ద కూడా తులసి మొక్కల సమీపంలో దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. భక్తులు వెలిగించిన దీపాల కాంతులతో

దుబ్బరాజేశ్వరుడి సన్నిధిలో భక్తజనం

కార్తీక పౌర్ణమి వేళ ఆలయానికి పోటెత్తిన భక్తులు

సారంగాపూర్, నవంబర్ 24 (ఈవార్తలు): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ గ్రామంలోని శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే చుట్టుపక్కల గ్రామాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున దుబ్బరాజేశ్వరస్వామిని దర్శించుకోవడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



లక్ష దీపాల వెలుగుల్లో వేములవాడ

స్వామివారి పల్లకీ మోసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్, నవంబర్ 24 (ఈవార్తలు): కార్తీక పౌర్ణమి సందర్భంగా వేములవాడలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో మంగళవారం జ్వాలాతోరణం, లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాన్ని వెలిగించారు. సాయంత్రం ప్రదోషకాల పూజ అనంతరం భీమేశ్వరాలయంలోని అశ్వత్థ నారాయణస్వామి సన్నిధి వద్ద శాస్త్రోక్తంగా జ్వాలాతోరణం నిర్వహించారు. హరిహరమూర్తులను పల్లకీలో జ్వాలాతోరణం కింద నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వయంగా స్వామివారి



పల్లకీని మోశారు. కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భీమేశ్వరాలయ మండపంలో మహిళల ఆధ్వర్యంలో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భీమేశ్వర సదన్ వసతి గృహం పార్కింగ్ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లతో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణల మధ్య స్వామివారి చిత్రపటాల ఆకృతుల్లో మహిళలు దీపాలను వెలిగించారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆకృతిలో దీపాలను వెలిగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లక్ష దీపాల కాంతులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

అర్హులందరికీ చేయూత పింఛన్లు

గొల్లపల్లి మండలంలో కొత్తగా 735 మందికి మంజూరు

జిల్లావ్యాప్తంగా 13,913 కొత్త పింఛన్లు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: మంత్రి అడ్లూరి

గొల్లపల్లి, నవంబర్ 24 (ఈవార్తలు): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలంలో కొత్తగా మంజూరైన 735 ఆసరా చేయూత పింఛన్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గొల్లపల్లి మండలంలో గతంలో 9,336 మంది పింఛన్లు పొందుతుండగా,



కొత్తగా మరో 735 మందికి మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో మండలంలో మొత్తం పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 10,071కి చేరిందన్నారు. అలాగే 2,457 కొత్త రేషన్ కార్డులు, 545 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి తెలిపారు. వచ్చే జనవరి నుంచి జూన్ 2 వరకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తామన్నారు. రానున్న రెండేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లావ్యాప్తంగా 13,913 కొత్త పింఛన్లు మంజూరు కాగా, ధర్మపురి నియోజకవర్గానికి 3,400 కేటాయించినట్లు తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్ రాని వారు ఆందోళన చెందవద్దని సూచించారు. త్వరలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రఘువరన్, స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్తీక శోభతో ధర్మపురి గోదావరిలో పుణ్యస్నానాలు

ధర్మపురి, నవంబర్ 24 (ఈవార్తలు): కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి భక్తజన సందోహంతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ధర్మపురికి తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గోదావరి నదీ తీరంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో పంచ సహస్ర దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు. వేలాది దీపాల కాంతులతో ధర్మపురి క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో తిరుగు ప్రయాణంలో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో పలువురు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ధర్మపురి సీఐ రాం



నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు భద్రతా చర్యలు చేపట్టారు.



కార్‌ఫ్యూలింగ్‌తో ట్రాఫిక్‌కు చెక్

'నో సోలో.. సాఫ్ చలో' నినాదంతో సైబరాబాద్ మూవ్స్-2026

శేరిలింగంపల్లి, నవంబర్ 24 (ఈవార్తలు): ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రజా రవాణా, కార్‌పూలింగ్‌ను ప్రోత్సహించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పిలుపునిచ్చారు. 'హాయ్ బోలో.. దిల్ ఖోలో.. నో సోలో.. సాఫ్ చలో' నినాదంతో ఈ నెల 26, 27, 28 తేదీల్లో రాయదుర్గంలోని టీ-హబ్‌లో 'సైబరాబాద్ మూవ్స్-2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్లలో ఒంటరిగా ప్రయాణించకుండా ఇతరులతో కలిసి ప్రయాణించే అలవాటును పెంపొందించు కోవాలని సూచించారు. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ వంటి ప్రజా రవాణా సేవలను ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో భాగంగా ఆర్టీసీ అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే ట్రాఫిక్ రద్దీ లేని సైబరాబాద్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్-1 డీసీపీ డాక్టర్ ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ హనుమంతరావు, ఎస్సీఎస్సీ సీఈఓ నవీద్ ఆలం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధుల నియామకం

వేములవాడ అర్బన్, నవంబర్ 24 (ఈవార్తలు): బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధులుగా రేగుల శ్రీకాంత్, దేవసాని కృష్ణ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మంగళవారం ఈ నియామకాలు చేపట్టారు. నూతనంగా నియమితులైన అధికార ప్రతినిధులకు గోపి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. వేములవాడకు చెందిన రేగుల శ్రీకాంత్ స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో విద్యాభ్యాసం ప్రారంభించారు. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన దుబాయ్‌లో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగాన్ని వదిలి సామాజిక సేవ, రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో రాజకీయాల్లో కొనసాగుతున్న శ్రీకాంత్ స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున కీలకంగా పనిచేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన తల్లి కౌన్సిలర్‌గా విజయం సాధించడంలోనూ క్రియాశీలక పాత్ర పోషించారు. జిల్లా అధికార ప్రతినిధిగా తనను నియమించడం పట్ల రేగుల



శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



వేయి దీపాల వెలుగుల్లో ధన్వంతరి ఆలయం

కార్తీక పౌర్ణమి సందర్భంగా అఖండ దీపారాధన

జగిత్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): కార్తీక పౌర్ణమి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో వేయి దీపాల అఖండ దీపారాధన ఘనంగా నిర్వహించారు. మంగళవారం పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. వేయి దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి రోజున దీపం వెలిగించడం వల్ల పుణ్యం లభిస్తుందని, ధన్వంతరి అనుగ్రహంతో ఆరోగ్యం, ధనలక్ష్మి కటాక్షంతో ఐశ్వర్యం, సూర్యుడి అనుగ్రహంతో తేజస్సు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. దీపారాధన అనంతరం అష్టదశ కలశాల ఉద్వాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్-లత, కోశాధికారి వడ్లగట్ట స్వాతి-గోపి, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్-గీత, హర్షిణి, లావణ్య, లత, మమత తదితరులు పాల్గొన్నారు.



దీక్షా దివస్‌కు ముమ్మర ఏర్పాట్లు

అలుగునూర్‌లో సభా ప్రాంగణాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

కరీంనగర్, నవంబర్ 24 (ఈవార్తలు): ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ స్ఫూర్తి సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, మాజీ సుడా చైర్మన్ జీవీ రామకృష్ణ సభా ప్రాంగణాన్ని సందర్శించారు. సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్, రాకపోకలు, సభా వేదిక ఏర్పాట్లపై చర్చించారు. సభకు తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లపై సమాలోచనలు జరిపారు.



జగిత్యాల అభివృద్ధిపై చర్చకు సిద్ధం

భోగ శ్రావణిపై వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి: బీజేపీ

జగిత్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిపై ప్రస్తుత చైర్‌పర్సన్ సమిండ్ల వాణి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై మున్సిపల్ పాలకవర్గం దృష్టి పెట్టాలని కోరారు. అర్హులైన నేతన్నలకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భోగ శ్రావణిపై చేసిన వ్యాఖ్యలను చైర్‌పర్సన్ వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆముద రాజు, కట్ట విజయ్, పవన్‌సింగ్, ఇట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో పరమశివుడు

భక్తులను ఆకట్టుకుంటున్న కోనాపూర్ పురాతన శివాలయం

కొడిమ్యాల, నవంబర్ 24 (ఈవార్తలు): దట్టమైన అడవి.. చుట్టూ పచ్చని చెట్లు.. ప్రశాంతమైన వాతావరణం.. ప్రకృతి ఒడిలో కొలువైన పరమశివుడు.. ఇదీ కొడిమ్యాల మండలం కోనాపూర్ అటవీ ప్రాంతంలోని పురాతన శివాలయం ప్రత్యేకత. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ శివక్షేత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అడవి అందాల మధ్య వెలసిన పరమశివుడిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి సౌందర్యానికి, ఆధ్యాత్మికతకు నిలయంగా ఉన్న ఈ పురాతన ఆలయం భక్తులకు ప్రశాంతతను అందిస్తోంది. కార్తీకమాసంలో కోనాపూర్ అటవీ ప్రాంతంలోని ఈ శివక్షేత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

సముద్రంలో ఏడుగురు మత్స్యకారుల గల్లంతు

పది రోజులుగా లభించని ఆచూకీ..
కుటుంబాల్లో ఆందోళన

నవంబర్ 11న వేటకు వెళ్లిన
కాకినాడ జిల్లా వాసులు

14వ తేదీ నుంచి తెగిపోయిన ఫోన్ సంబంధాలు

కాకినాడ, నవంబర్ 24 (ఈవార్తలు): బతుకుదెరువు కోసం సముద్రంలో వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో ఏపీలోని కాకినాడ జిల్లాలోని వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. సముద్రంలోకి వెళ్లి దాదాపు రెండు వారాలు కావస్తున్నా వారు తిరిగి రాలేదు. గత పది రోజులుగా వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 11న బోటులో చేపల వేటకు బయలుదేరారు. సముద్రంలోకి వెళ్లిన తర్వాత నవంబర్ 14 వరకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అప్పటివరకు అంతా బాగానే ఉందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే 14వ తేదీ తర్వాత వారి ఫోన్లు కలవడం లేదు. ఎంత ప్రయత్నించినా ఎలాంటి సమాచారం అందడం లేదు. రోజులు గడుస్తున్నా బోటు తిరిగి రాకపోవడంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన పెరుగుతోంది. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బోటు చిక్కుకుపోయిందా? లేక సాంకేతిక



లోపం తలెత్తిందా? అన్నది తెలియాల్సి ఉంది. చివరిసారిగా నవంబర్ 14న తమతో మాట్లాడారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేటకు వెళ్లినవారి పరిస్థితి ఏమిటో తెలియక సుబ్బంపేటలో వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. తమ వారిని క్షేమంగా తిరిగి తీసుకురావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



యూఏఈలో ఘోర ప్రమాదం.. 13 మంది మృతి

మృతుల్లో భారతీయులు.. మరో 14 మందికి గాయాలు

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న ప్రయాణికుల బస్సు

బాధిత కుటుంబాలకు భారత కాన్సులేట్ అండ

దుబాయ్, నవంబర్ 24 : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రక్కును బలంగా ఢీకొనడంతో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడ్డారు. మృతుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు దుబాయ్‌లోని భారత కాన్సులేట్ ధ్రువీకరించింది. దీంతో ప్రవాస భారతీయ కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రమాదంలో మరణించిన భారతీయుల సంఖ్యను అధికారులు ఇంకా వెల్లడించలేదు. రస్ అల్ ఖైమాలోని అల్ వతన్ రోడ్డుపై మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. బస్సులో మొత్తం 41 మంది ప్రయాణిస్తున్నారు. సాంకేతిక సమస్య కారణంగా ఓ ట్రక్కు రోడ్డు పక్కన నిలిచిపోయింది. అదే మార్గంలో వచ్చిన ప్రయాణికుల బస్సు ఆ ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సులోని పలువురు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, అత్యవసర వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. తొలుత 11 మంది మరణించినట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు మృతి చెందడంతో మృతుల సంఖ్య 13కు పెరిగింది. ప్రమాదంలో భారతీయులు మృతి చెందినట్లు భారత కాన్సులేట్ ప్రకటించింది. బాధిత కుటుంబాలను సంప్రదిస్తున్నామని, యూఏఈ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన పూర్తి పరిస్థితులపై స్థానిక అధికారులు విచారణ ప్రారంభించారు. బస్సు వేగం, రహదారి పరిస్థితులు, ట్రక్కు నిలిపిన ప్రదేశం వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. మృతుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



క్లోమగ్రంథి క్యాన్సర్‌కు కొత్త ఆశ

సరికొత్త మాత్రతో చికిత్సలో పురోగతి

కీమోథెరపీతో కలిపి ఇవ్వగా మెరుగైన ఫలితాలు

61 మంది రోగులపై అధ్యయనం

60.7 శాతం మందిలో కణితుల పరిమాణం తగ్గుదల

న్యూఢిల్లీ, నవంబర్ 24 : ప్రాణాంతకంగా మారే క్లోమగ్రంథి క్యాన్సర్ చికిత్సలో శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. రెవల్యూషన్ మెడిసిన్స్ సంస్థ అభివృద్ధి చేసిన 'దరాక్సాన్‌రాసిబ్' అనే మాత్రను కీమోథెరపీతో కలిపి అందించడం ద్వారా ముదిరిన దశలోని క్యాన్సర్ రోగుల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయి. స్పెయిన్‌లోని బార్సిలోనాలో నవంబర్ 20న జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సులో ఈ పరిశోధన వివరాలను వెల్లడించారు. కణితులు పెరగకుండా నియంత్రించడంలో ఈ చికిత్స ఆశాజనకంగా పనిచేస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు. క్లోమగ్రంథి క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం కష్టమైన సందర్భాలు ఎక్కువగా ఉంటాయి. వ్యాధి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించిన తర్వాత చికిత్స మరింత క్లిష్టమవుతుంది. ఇలాంటి రోగుల్లో మందుల ప్రభావం ఎంతకాలం కొనసాగుతుందనే అంశాన్ని పరిశీలించేందుకు పరిశోధకులు కొత్త చికిత్సా విధానాలపై దృష్టి పెట్టారు. బార్సిలోనాలో వెల్లడించిన ఫేజ్-1/2 అధ్యయనంలో మొత్తం 61 మంది రోగులు పాల్గొన్నారు. వీరికి దరాక్సాన్‌రాసిబ్ మాత్రతో పాటు జెమ్‌సిటబీన్, నాబ్-పాక్లిటాక్సెల్ కీమోథెరపీ మందులను అందించారు. ఈ చికిత్స పొందిన రోగుల్లో 60.7 శాతం మందికి కణితుల పరిమాణం తగ్గినట్లు లేదా స్కానింగ్‌లో పూర్తిగా కనిపించకుండా పోయినట్లు పరిశోధకులు గుర్తించారు. సుమారు 8.2 శాతం మందిలో స్కానింగ్ పరీక్షల్లో కణితులు కనిపించని స్థాయికి చేరాయి. మొత్తం 90.2 శాతం మందిలో వ్యాధి నియంత్రణలో ఉన్నట్లు తేలింది. అయితే ఈ గణాంకం అంటే రోగులందరిలో క్యాన్సర్ పూర్తిగా నయమైందని కాదు. కొందరిలో కణితులు తగ్గగా, మరికొందరిలో పెరుగుదల కొంతకాలం నిలిచిపోయింది. కణితులు తిరిగి పెరగకుండా ఉన్న మధ్యస్థ కాలం 12.8 నెలలుగా నమోదైంది. ఈ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో రోగులపై మరిన్ని పరీక్షలు అవసరమని పరిశోధకులు స్పష్టం చేశారు.

బహిరంగ విమర్శలు వద్దు

రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డికి కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సూచన

సమస్యలుంటే నేరుగా
తన దృష్టికి తేవాలన్న సందీప్
నిధుల కేటాయింపు, అధికారుల
కమీషన్లపై ఎమ్మెల్యేల అసంతృప్తి

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై బహిరంగంగా విమర్శలు చేస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలకు పార్టీ అధిష్ఠానం నుంచి కీలక సూచనలు అందాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం రాత్రి తెలంగాణ కాంగ్రెస్ నూతన ఏఐసీసీ ఇన్‌ఛార్జి బీఎం సందీప్‌తో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఇటీవల తాము చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చినట్లు సమాచారం. పార్టీకి సంబంధించిన సమస్యలను బహిరంగంగా ప్రస్తావించకుండా తన దృష్టికి తీసుకురావాలని సందీప్ సూచించినట్లు తెలిసింది. ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి నిధుల కేటాయింపు, అధికారుల వ్యవహారశైలి వంటి అంశాలపై ఇద్దరు ఎమ్మెల్యేలు ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీయడంతో పార్టీ అధిష్ఠానం రంగంలోకి దిగింది. ఎమ్మెల్యేలతో సమావేశమైన సందీప్ పార్టీ అంతర్గత సమస్యలను బహిరంగంగా ప్రస్తావించడం సరికాదని సూచించినట్లు సమాచారం. ప్రభుత్వ పనితీరుపైనా, ఇతర అంశాలపైనా అభ్యంతరాలుంటే నేరుగా తనను కలిసి వివరించాలని చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ నాయకుల మధ్య సమన్వయం, ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను పూర్తిగా పరిశీలించిన



తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఈ సమావేశాలకు ముందు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవితో సందీప్ చర్చించారు. రాజగోపాల్‌రెడ్డి వ్యవహారంపై ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని మల్లు రవి ఇప్పటికే పేర్కొన్నారు. మరోవైపు ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం నాయకులు అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది.

నిధుల కేటాయింపుపై రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం

నియోజకవర్గాలకు అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని రాజగోపాల్‌రెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై విమర్శలు చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల బిల్లుల క్లియరెన్స్ కోసం కొందరు అధికారులు భారీగా కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యవహారాలతో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోందని పేర్కొన్నారు. నవంబర్ 19న సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమ్మతి వ్యక్తం చేస్తున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారిని ఉద్దేశించి 'పిచ్చి కుక్కలు కరిచాయని', పార్టీ శ్రేణులే 'మెంటల్ ఆసుపత్రికి' తీసుకెళతాయని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే రాజగోపాల్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉన్నత పదవుల్లో ఉన్న నాయకులు హుందాగా మాట్లాడాలని సూచించారు. అధికార మదంతో ఇష్టానుసారం వ్యవహరిస్తే ప్రజలు హర్షించరని వ్యాఖ్యానించారు. అవినీతి, కక్షపూరిత పాలన, ప్రజా సంక్షేమాన్ని విస్మరించే నాయకులను ప్రజలు క్షమించరని విమర్శించారు. అలాంటి నాయకులకు ఆత్మపరిశీలన చేసుకునే జ్ఞానాన్ని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సద్బుద్ధిని ప్రసాదించాలని అయ్యప్పస్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డి అయ్యప్ప మాల ధరించి ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు ఎమ్మెల్యేలు కొత్త ఇన్‌ఛార్జిని కలవడం కాంగ్రెస్ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

డిసెంబర్ నుంచి కొత్త ఛార్జీలు

క్రెడిట్ కార్డులపై అదనపు భారం

గ్యాస్ ధరల సమీక్ష, ఆర్‌బీఐ కీలక సమావేశం

న్యూఢిల్లీ, నవంబర్ 24 : డిసెంబర్ నెల ప్రారంభంతో బ్యాంకింగ్, క్రెడిట్ కార్డులు, వంటగ్యాస్ ధరలు, ఆధార్ సేవలకు సంబంధించిన పలు అంశాలు వినియోగదారులకు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై కొన్ని లావాదేవీలకు కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన కమిటీ సమావేశం డిసెంబర్ 2 నుంచి 4 వరకు జరగనుంది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు గృహ, వాహన రుణాల వడ్డీ రేట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఎస్‌బీఐ కార్డ్ డిసెంబర్ 1 నుంచి కొన్ని రకాల రవాణా, ఇంధన చెల్లింపులపై సర్‌ఛార్జీలు అమలు చేయనుంది. రవాణాకు సంబంధించిన ఒకే లావాదేవీలో రూ.30 వేలకు మించి చెల్లిస్తే ఒక శాతం అదనపు రుసుము వర్తిస్తుంది. అలాగే ఒక బిల్లింగ్ సైకిల్‌లో ఇంధన



కొనుగోళ్ల మొత్తం రూ.50 వేలు దాటితే ఆ సైకిల్‌లోని మొత్తం ఇంధన చెల్లింపులపై ఒక శాతం ఛార్జీ విధించనున్నట్లు సంస్థ వెల్లడించింది. దీంతో క్రెడిట్ కార్డుల ద్వారా భారీ మొత్తంలో రవాణా, పెట్రోల్, డీజిల్ ఖర్చులు చెల్లించే వినియోగదారులపై అదనపు భారం పడనుంది. అయితే అన్ని రకాల క్రెడిట్ కార్డు లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తించవు. నిర్ణయించిన కేటగిరీలు, పరిమితులకే వర్తిస్తాయి. డిసెంబర్ 2 నుంచి 4 వరకు భారత రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన కమిటీ సమావేశం జరగనుంది. అక్టోబర్ సమీక్షలో రెపో రేటును 0.25 శాతం పెంచి 5.50 శాతానికి చేర్చారు. ఇప్పుడు జరగనున్న సమావేశంలో వడ్డీ రేట్లను కొనసాగిస్తారా, పెంచుతారా, తగ్గిస్తారా అనే అంశంపై మార్కెట్ వర్గాలు దృష్టి పెట్టాయి. రెపో రేటులో మార్పు జరిగితే బ్యాంకుల ఫ్లోటింగ్ రేటు గృహ, వాహన రుణాల వడ్డీపై ప్రభావం ఉండవచ్చు. అయితే సమావేశం జరగకముందే ఈఎంఐలు పెరుగుతాయని చెప్పలేం. ఆర్‌బీఐ తుది నిర్ణయం ఆధారంగానే వడ్డీ రేట్లలో మార్పులు ఉంటాయి. ఆధార్ మొబైల్ యాప్ ద్వారా ఈమెయిల్ చిరునామాను నమోదు చేసుకునే లేదా అప్‌డేట్ చేసుకునే సేవను యూఐడీఏఐ డిసెంబర్ 31 వరకు ఉచితంగా అందిస్తోంది. సాధారణంగా ఈ సేవకు వసూలు చేసే రుసుమును తాత్కాలికంగా మినహాయించింది. అయితే ఈ వెసులుబాటు అధికారిక ఆధార్ మొబైల్ యాప్‌కు సంబంధించినదే. డిసెంబర్ 1న చమురు మార్కెటింగ్ సంస్థలు ఎల్పీజీ సిలిండర్ల ధరలను సమీక్షించనున్నాయి. గృహ వినియోగ, వాణిజ్య సిలిండర్ల ధరల్లో మార్పులు ఉంటాయా లేదా అనేది ఆ రోజునే వెల్లడవుతుంది. ధరల పెంపు ముందుగానే ఖరారైందని భావించరాదు.

హసీనాను బేడీలతోనే తీసుకొస్తాం

బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ
సహాయ మంత్రి హెచ్చరిక

ఢాకా, నవంబర్ 24 : భారత్‌లో ఉన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి రావడంపై ఢాకా ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. హసీనా తిరిగి రావాలంటే ఖైదీగా, కట్టుదిట్టమైన భద్రత మధ్య మాత్రమే తీసుకువస్తామని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ ప్రకటించారు. ఆమెకు ప్రత్యేక విమానం పంపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని హసీనా భావిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఢాకాలో మంగళవారం విదేశీ దౌత్యవేత్తల సమావేశం అనంతరం కబీర్ మీడియాతో మాట్లాడారు. హసీనా సాధారణ ప్రయాణిక ఎరాలిగా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ఆమెకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆమెను అప్పగించే అంశంపై భారత్‌తో చర్చలు జరపాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 16న బంగ్లాదేశ్ విజయ్ దివస్ సందర్భంగా స్వదేశానికి రావాలనుకుంటున్నట్లు హసీనా ప్రకటించిన నేపథ్యంలో ఆమెకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రచారంలోకి వచ్చింది. ఈ ప్రతిపాదనపై బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఎండీ అమీనుల్ ఇస్లాం అభ్యంతరం వ్యక్తం చేశారు. తీవ్రమైన నేరాల్లో శిక్ష పడిన వ్యక్తిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక విమానం పంపడం కాదని ఆయన వ్యాఖ్యానించారు. హసీనా అప్పగింతను సాధారణ ప్రయాణ ఏర్పాటుగా కాకుండా చట్టపరమైన ప్రక్రియగా చూడాలని అన్నారు. ప్రధానమంత్రి సమాచార సలహాదారు జూహెద్ ఉర్ రెహమాన్ కూడా హసీనా రాకపై సంప్రదింపులు ఆమెతో కాకుండా భారత ప్రభుత్వంతోనే జరపాల్సి ఉంటుందని చెప్పారు. రెండు దేశాల మధ్య ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందం, వర్తించే చట్టాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

హింసపై 60 దేశాల దౌత్యవేత్తలతో సమావేశం

హసీనా తిరిగి రావడంపై ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. దేశంలో ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు నిషేధిత అవామీ లీగ్‌కు చెందిన కొన్ని వర్గాలే కారణమని ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ పరిణామాలపై భారత్, అమెరికా, బ్రిటన్, చైనా సహా దాదాపు 60 దేశాల దౌత్యవేత్తలకు ఢాకా ప్రభుత్వం వివరాలు అందించినట్లు కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు ఎన్‌సీపీ నేత నహీద్ ఇస్లాం భారత్ వైఖరిపై విమర్శలు చేశారు. అయితే హింసకు కారణమైన వ్యక్తులు, సంస్థల పాత్రను అధికారిక దర్యాప్తు ఆధారంగానే నిర్ధారించాల్సి ఉంటుంది.

బంజారాహిల్స్ పక్కన గజం రూ.2 లక్షలు

హుడా హైట్స్‌లో ఎనిమిది ప్రీమియం ప్లాట్ల ఈ-వేలం

నవంబర్ 25న ఆన్‌లైన్ బిడ్డింగ్.. ఒక్కో ప్లాట్‌కు రూ.కోటి ఈఎండీ

హైదరాబాద్, నవంబర్ 24 (ఈవార్తలు): హైదరాబాద్‌లో అత్యంత విలువైన ప్రాంతాల్లో ఒకటైన బంజారాహిల్స్ సమీపంలో హెచ్‌ఎండీఏ భారీ భూముల వేలానికి సిద్ధమైంది. షేక్‌పేట మండలం హకీంపేట్ గ్రామంలోని ఎమ్మెల్యే కాలనీ సమీపంలో ఉన్న హుడా హైట్స్ లేఅవుట్‌లో ఎనిమిది ప్రీమియం ఓపెన్ ప్లాట్లకు నవంబర్ 25న ఈ-వేలం నిర్వహించనుంది. ఈ ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధరను రూ.2 లక్షలుగా నిర్ణయించింది. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. నగరంలో కీలకమైన ప్రాంతానికి సమీపంలో ఉండటం, అభివృద్ధికి అవకాశాలు ఉండటంతో ఈ ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. హుడా హైట్స్ లేఅవుట్‌లో వేలం వేయనున్న ఎనిమిది ప్లాట్ల విస్తీర్ణం 1,084 నుంచి 1,438 చదరపు గజాల వరకు ఉంది. చదరపు గజానికి రూ.2 లక్షలను కనీస బిడ్డింగ్ ధరగా నిర్ణయించారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఒక్కో ప్లాట్‌కు రూ.కోటి ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) చెల్లించాల్సి ఉంటుంది. బంజారాహిల్స్ సమీపంలో ఉండటంతో రియల్ ఎస్టేట్ డెవలపర్లు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలకు ఈ స్థలాలు అనుకూలంగా ఉంటాయని హెచ్‌ఎండీఏ పేర్కొంది. వాణిజ్యపరమైన అభివృద్ధి అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. నవంబర్ 25న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంఎస్‌టీసీ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ జరగనుంది. ఈ వేలంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్, ఈఎండీ చెల్లింపుల గడువు నవంబర్ 23తో ముగిసింది. హైదరాబాద్‌లో నవంబర్ నెలలో చేపట్టిన భూముల విక్రయాల కార్యక్రమంలో భాగంగా ఈ ప్లాట్లను వేలం వేస్తున్నట్లు హెచ్‌ఎండీఏ వెల్లడించింది.

కన్నవారిని వదిలేస్తే మూడేళ్ల జైలు

పిల్లలకు కేరళ ప్రభుత్వం హెచ్చరిక

అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లు

గవర్నర్ ఆమోదం తర్వాతే అమలు



తిరువనంతపురం, నవంబర్ 24 : తల్లిదండ్రుల ఆస్తులను తమ పేరున రాయించుకుని ఆ తర్వాత వారిని పట్టించుకోకుండా వదిలేసే పిల్లలకు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా కేరళ ప్రభుత్వం కొత్త చట్టాన్ని ప్రతిపాదించింది. వృద్ధుల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర అసెంబ్లీ అక్టోబర్‌లో ఆమోదించిన బిల్లులో ఈ నిబంధనను చేర్చినట్లు ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ వెల్లడించారు. గవర్నర్ ఆమోదం లభించిన తర్వాత చట్టాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. కొల్లం జిల్లా పతనపురంలోని గాంధీభవన్‌లో వృద్ధుల కోసం నిర్మించిన 'పితృమందిరం' నివాస సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఆస్తులన్నీ తీసుకున్న తర్వాత తల్లిదండ్రులను ఒంటరిగా వదిలేయడం, వారిని నిర్లక్ష్యం చేయడం వంటి ఘటనలను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు అవసరమని అన్నారు. పిల్లలను పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడతారని, జీవిత చరమాంకంలో వారికి అండగా నిలవాల్సిన బాధ్యత సంతానంపైనే ఉంటుందని పేర్కొన్నారు. ఆస్తులు రాయించుకున్న తర్వాత కన్నవారిని పట్టించుకోని వారిపై చర్యలు తీసుకునేలా నిబంధన రూపొందించినట్లు వివరించారు. యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసినట్లు సతీశన్ తెలిపారు. దేశంలో ఇలాంటి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచిందని పేర్కొన్నారు. వయోవృద్ధులకు సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనం కల్పించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఏ వృద్ధుడూ ఒంటరితనంతో బాధపడకూడదని, కుటుంబ సభ్యులు వారిని గౌరవంగా చూసుకునే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. పతనపురంలోని గాంధీభవన్‌లో వృద్ధ పురుషుల కోసం రూ.20 కోట్లతో పితృమందిరం నివాస సముదాయాన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి లులు గ్రూప్ అధినేత ఎం.ఎ. యూసుఫ్ అలీ ఆర్థిక సహాయం అందించారు. వృద్ధులకు ఆశ్రయం కల్పించే ఈ కార్యక్రమానికి సహకరించినందుకు సీఎం ఆయనను అభినందించారు. అయితే మూడేళ్ల జైలు శిక్ష నిబంధన ఇంకా అమల్లోకి రాలేదు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ అనుమతి లభించి, అవసరమైన చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఈ నిబంధన వర్తిస్తుంది.



హోండా నుంచి 500 సీసీ బైక్

రూ.2.75 లక్షల ప్రారంభ ధర

మూడు వేరియంట్లలో సీబీ500 విడుదల

న్యూఢిల్లీ, నవంబర్ 24 : ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా భారత మార్కెట్‌లో కొత్త 500 సీసీ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. 'హోండా సీబీ500' పేరుతో తీసుకొచ్చిన ఈ బైక్ ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధరను రూ.2.75 లక్షలుగా నిర్ణయించింది. మొత్తం మూడు వేరియంట్లలో అందుబాటులో ఉండే ఈ బైక్‌కు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది చివర్లో డెలివరీలు మొదలయ్యే అవకాశం ఉందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. భారత మార్కెట్‌లో పెద్ద ఎయిర్‌కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ కలిగిన మోటార్‌సైకిళ్లను ఇష్టపడే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని హోండా కొత్త మోడల్‌ను తీసుకొచ్చింది. గతంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ 500 సీసీ మోడళ్లు నిలిచిపోయిన తర్వాత ఈ విభాగంలో కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సీబీ500లో 501 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్ అండ్ ఆయిల్ కూల్డ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 5,250 ఆర్‌పీఎం వద్ద 28 హెచ్‌పీ పవర్, 3,750 ఆర్‌పీఎం వద్ద 43.3 ఎన్ఎమ్ గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్‌తో కూడిన ఐదు స్పీడ్ గేర్‌బాక్స్‌ను అందించారు. భద్రత కోసం డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, ముందు వెనుక డిస్క్ బ్రేకులు ఉన్నాయి. ముందు 19 అంగుళాలు, వెనుక 17 అంగుళాల వీల్స్‌ను అమర్చారు. సస్పెన్షన్ కోసం ముందు టెలిస్కోపిక్ ఫోర్క్, వెనుక ప్రీలోడ్ అడ్జస్టబుల్ ట్విన్ షాక్ అబ్జార్బర్లను అందించారు. బేస్ అల్లాయ్ వేరియంట్ ధర రూ.2.75 లక్షలు. క్రాస్ స్పోక్ ట్యూబ్‌లెస్ వీల్స్‌తో వచ్చే మిడ్ వేరియంట్ ధర రూ.3 లక్షలు కాగా, ప్రత్యేక రంగులు, గ్రాఫిక్స్‌తో వచ్చే టాప్ వేరియంట్ ధర రూ.3.02 లక్షలుగా నిర్ణయించారు. అన్ని వేరియంట్లలో హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్, అనలాగ్-డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, రోడ్‌సింక్ కనెక్టివిటీ వంటి ఫీచర్లు ఉంటాయి. ఈ బైక్ బరువు 189 కిలోలు కాగా, గ్రౌండ్ క్లియరెన్స్ 168 మిల్లీమీటర్లు. రోజువారీ ప్రయాణాలతో పాటు సుదూర ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని దీనిని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది.





ఆస్కార్ బరిలో
రెండు భారతీయ చిత్రాలు

అర్హత సాధించిన 'గోంధళ్', 'అంగ్'.. డిసెంబర్ 15న షార్ట్‌లిస్ట్ వెల్లడి

ఈవార్తలు, వినోదవాణి: ప్రతిష్ఠాత్మక 99వ ఆస్కార్ అవార్డుల రేసులో భారతీయ సినిమా మరో అడుగు ముందుకేసింది. భారత్ తరఫున అధికారిక ఎంట్రీగా ఎంపికైన మరాఠీ చిత్రం 'గోంధళ్' ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో పోటీపడేందుకు అర్హత సాధించింది. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన ప్రాథమిక అర్హత జాబితాలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 104 చిత్రాలకు చోటు దక్కింది. అయితే ఇది కేవలం ప్రాథమిక అర్హత జాబితా మాత్రమేనని, ఆస్కార్ నామినేషన్ కాదని అకాడమీ వర్గాలు స్పష్టం చేశాయి. సంతోష్ దవాఖర్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన 'గోంధళ్' మహారాష్ట్ర గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రం. 'గోంధళ్' అనే సంప్రదాయ జానపద క్రతువు నేపథ్యంలో ఒక్క రాత్రిలో జరిగే సంఘటనలతో ఈ సినిమాను రూపొందించారు. ఇష్టం లేని వైవాహిక బంధంలో చిక్కుకున్న సుమన్ అనే మహిళ తన భర్తను ఏమార్చి ప్రియుడితో కలిసి పారిపోయేందుకు చేసే ప్రయత్నాల చుట్టూ కథ సాగుతుంది. ఇషితా దేశ్‌ముఖ్ ప్రధాన పాత్ర పోషించగా, కిశోర్ కదమ్, యోగేష్ సోహోనీ, నిషాద్ భోయిర్ కీలక పాత్రల్లో నటించారు. 2025లో జరిగిన 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)లో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. అక్కడ సంతోష్ దవాఖర్ ఉత్తమ దర్శకుడిగా సిల్వర్ పీకాక్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 33 చిత్రాలను పరిశీలించి 'గోంధళ్'ను ఆస్కార్‌కు భారత్ అధికారిక ఎంట్రీగా ఎంపిక చేసింది. 'శ్వాస్', 'హరిశ్చంద్రాచి ఫ్యాక్టరీ', 'కోర్ట్' తర్వాత భారత్ తరఫున ఆస్కార్ బరిలో నిలిచిన నాలుగో మరాఠీ చిత్రంగా గుర్తింపు పొందింది.





సోషల్ మీడియా అల్గారిథమ్‌పై కరణ్ జోహర్ అసహనం

ఈవార్తలు, వినోదవాణి: సోషల్ మీడియా అల్గారిథమ్‌పై బాలీవుడ్ ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహర్ అసహనం వ్యక్తం చేశారు. తన ఆలోచనలు, భావోద్వేగాలను ప్రభావితం చేస్తూ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఆసక్తికర పోస్ట్ చేశారు. తనకు ఏమాత్రం సంబంధం లేని విషయాలపై కూడా స్పందించేలా సోషల్ మీడియా ఫీడ్ ప్రేరేపిస్తోందని పేర్కొన్నారు. పరిచయం లేని వ్యక్తుల వ్యక్తిగత బంధాలపై భావోద్వేగానికి గురిచేయడంతో పాటు అవసరం లేని వస్తువులను కొనుగోలు చేసేలా ప్రభావితం చేస్తోందన్నారు. "నాకు తెలియని వ్యక్తుల బంధాలపై అనవసరంగా భావోద్వేగానికి గురయ్యేలా నా అల్గారిథమ్ చేస్తోంది. నాకు అక్కర్లేని వస్తువులను కొనుగోలు చేసేలా ప్రేరేపిస్తోంది. నా నియంత్రణలో లేని విషయాలపై కోపం తెప్పిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే నా సోషల్ మీడియా ఫీడ్‌కు ఓ థెరపిస్ట్ అవసరం ఉంది" అని కరణ్ జోహర్ వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా అల్గారిథమ్‌లు వ్యక్తుల ఆలోచనలు, భావోద్వేగాలు, కొనుగోలు అలవాట్లను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

'కింగ్ 100' కౌంట్‌డౌన్ షురూ



ఈవార్తలు, వినోదవాణి: అక్కినేని నాగార్జున కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న వందో చిత్రం 'కింగ్ 100' విడుదల తేదీపై చిత్ర బృందం స్పష్టత ఇచ్చింది. ముందుగా ప్రకటించిన విధంగానే డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. విడుదలకు మరో 30 రోజుల సమయం మాత్రమే ఉండటంతో మంగళవారం ప్రత్యేక కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ వస్తున్న ఊహాగానాలకు తెరపడింది. తాజా పోస్టర్‌లో నాగార్జున స్టైలిష్ అవతారంలో కనిపించారు. ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్‌లో డార్క్ సూట్, కళ్లజోడు ధరించి వింటేజ్ కారు ముందు నిలబడిన నాగార్జున లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. రెట్రో స్టైల్‌లో రూపొందించిన ఈ పోస్టర్ సినిమా కథా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది. దాదాపు ఏడాది కాలంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను మేకర్స్ చాలావరకు గోప్యంగా ఉంచారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్‌లో నాగార్జున పాత్రను పవర్‌ఫుల్‌గా పరిచయం చేశారు. "ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. డబ్బున్నవాళ్లు.. డబ్బు లేనివాళ్లు. నా దగ్గర డబ్బు లేనప్పుడు నన్ను ఓడిపోయినోడు అన్నారు. డబ్బు రాగానే నన్ను కింగ్ అన్నారు. కానీ ఈ గుర్తింపు డబ్బు కంటే చాలా శక్తివంతమైనది. ఈ గుర్తింపును నిలబెట్టుకోవడానికి నేను పరిగెడుతూనే ఉండాలి" అంటూ నాగార్జున చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. ఆర్ఏ కార్తీక్ రచన, దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, రాజా మహదేవన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సతీష్ కుమార్ ఎన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. పూర్వ, రజని, తాన్య, బ్రహ్మ కాస్ట్యూమ్స్ రూపొందించగా, వెంకట్, పృథ్వీ, నబకాంత్, రియల్ సతీష్, దినేష్ కాశీ యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. నాగార్జున వందో చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

'ఇది నా అడ్డా' అంటున్న మెగాస్టార్



ఈవార్తలు, వినోదవాణి: దాదాపు ఐదు దశాబ్దాలుగా వెండితెరపై ప్రేక్షకులను అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు సరికొత్త అవతారంలో సందడి చేయనున్నారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో టాక్ షోకు హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. 'చిరంజీవిన్ మెగావర్స్' పేరుతో రూపొందుతున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రోమోను మంగళవారం విడుదల చేశారు. 'ఇది నా అడ్డా' అంటూ చిరంజీవి తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రోమోలో చిరంజీవి పేరులోని 'ఎన్' అక్షరం కనిపించకుండా చేయడం ద్వారా ఆయన తదుపరి అడుగు నెట్‌ఫ్లిక్స్ వైపు అని వినూత్నంగా తెలియజేశారు. ఈ టాక్ షోలో చిరంజీవి తన చమత్కారాలతో ప్రేక్షకులను అలరించడంతో పాటు సినిమా, క్రీడలు, పాప్యులర్ కల్చర్‌కు చెందిన ప్రముఖులతో ముచ్చటించనున్నారు. కమల్ హాసన్, నాగార్జున, ప్రభాస్, బ్రహ్మానందం, రవితేజ, నాని, దర్శకులు సందీప్ రెడ్డి వంగా, బాబీ కొల్లి తదితరులు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొననున్నట్లు సమాచారం. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆటమ్ మీడియా వెంచర్స్, సోల్ ప్రొడక్షన్ ఎల్ఎల్పీ సంస్థలు సంయుక్తంగా ఈ టాక్ షోను నిర్మిస్తున్నాయి. నవంబర్ 30న సాయంత్రం 4.30 గంటల నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ కార్యక్రమం స్ట్రీమింగ్ కానుంది. మరోవైపు చిరంజీవి సినిమాలతోనూ బిజీగా ఉన్నారు. మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర', బాబీ కొల్లి దర్శకత్వంలో 'కాకా' చిత్రాలు చేస్తున్నారు. 'కాకా'ను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. సినిమాలతో పాటు టాక్ షో హోస్ట్‌గా చిరంజీవి ఎలా అలరించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

రాజకీయాల వైపు ధనుష్?



ఈవార్తలు, వినోదవాణి: తమిళ స్టార్ హీరో ధనుష్ తన అభిమానుల సేవా సంఘం 'సర్వణి ఇయక్కం' విస్తరణపై దృష్టి సారించినట్లు సమాచారం. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంఘం కార్యకలాపాలను విస్తరించాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న 58 సంస్థాగత జిల్లాలను వందకు పైగా పెంచి, రాష్ట్రంలోని మొత్తం 38 రెవెన్యూ జిల్లాల్లో సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. గత అక్టోబర్‌లో కోయంబత్తూరులో నిర్వహించిన సమావేశంలో తన అభిమాన సంఘాన్ని అధికారికంగా సేవా సంఘంగా మార్చిన ధనుష్.. సంఘం లేని ప్రాంతాల్లో కొత్త శాఖలను ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా మహిళా విభాగాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

చెక్ బౌన్స్ కేసులో బండ్ల గణేశ్‌కు ఊరట



ఈవార్తలు, వినోదవాణి: టాలీవుడ్ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు సంబంధించిన రూ.95 లక్షల చెక్ బౌన్స్ వివాదం సామరస్యపూర్వకంగా పరిష్కారమైంది. తమ మధ్య ఉన్న మనస్పర్థలు తొలగిపోయాయని ఈ కేసులో ఫిర్యాదుదారుడైన జెట్టి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. గతంలో ప్రకాశం జిల్లా మద్దిరాల-ముప్పాళ్లకు చెందిన జానకిరామయ్య వద్ద బండ్ల గణేశ్ రూ.95 లక్షలు తీసుకున్నారు. జానకిరామయ్య మరణం అనంతరం ఆయన తండ్రి జెట్టి వెంకటేశ్వరరావుకు పరమేశ్వర ఆర్ట్స్ పేరిట చెక్ ఇచ్చారు. ఖాతాలో తగినంత నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో వెంకటేశ్వరరావు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు.



రామగిరి ఖిల్లాపై చైతూ సాహసం



ఈవార్తలు, వినోదవాణి: అక్కినేని నాగచైతన్య సినిమా ప్రమోషన్లలో సరికొత్త ట్రెండ్‌కు తెరతీశారు. తన తాజా చిత్రం 'వృషకర్మ' ప్రచారంలో భాగంగా తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా చారిత్రక రామగిరి ఖిల్లాను అధిరోహించారు. ప్రముఖ యూట్యూబర్ జస్టితో కలిసి ట్రెక్కింగ్ చేస్తూ కోట చారిత్రక విశేషాలు, ప్రకృతి అందాలను పరిచయం చేసేలా ప్రత్యేక వీడియోను చిత్రీకరించారు. రామగిరి ఖిల్లాపై ట్రెక్కింగ్ చేసిన తొలి సినీ సెలబ్రిటీగా నాగచైతన్య నిలిచినట్లు ప్రచార బృందం పేర్కొంది. భారీ రాతి కట్టడాలు, ఏడు ద్వారాలతో కొండపై నిర్మించిన రామగిరి ఖిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. త్రేతాయుగంలో శ్రీరాముడు ఈ ప్రాంతంలో అడుగుపెట్టారని స్థానికుల విశ్వాసం. పచ్చని ప్రకృతి అందాలతో పాటు అరుదైన ఔషధ మూలికలకు ఈ ప్రాంతం నిలయంగా ఉంది. నాటి రాజుల కాలానికి చెందిన భారీ ఫిరంగులు, పురాతన ఆలయాలు ఇక్కడి చారిత్రక వైభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. కోట మొదటి ద్వారం నుంచి సుమారు 60 కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్ మానేరు ప్రాంతం కనిపిస్తుందని చెబుతున్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో మిథికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'వృషకర్మ' కథా నేపథ్యానికి అనుగుణంగా ఈ ట్రెక్కింగ్‌ను ప్లాన్ చేశారు. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. నాగచైతన్య, జస్టి కలిసి చేసిన రామగిరి ఖిల్లా సాహసయాత్రకు సంబంధించిన పూర్తి వీడియోను నవంబర్ 27న విడుదల చేయనున్నారు.



బ్యాట్లపై ఐసీసీ నజర్

అంతర్జాతీయ క్రికెట్‌లోనూ ఐపీఎల్ తరహా తనిఖీలు

ఈవార్తలు, క్రీడావాణి: అంతర్జాతీయ క్రికెట్‌లో బ్యాటర్లు ఉపయోగించే బ్యాట్ల పరిమాణంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మరింత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ తరహాలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ మైదానంలో బ్యాట్ల కొలతలను తనిఖీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. నిర్దేశించిన కొలతలకు మించి వెడల్పు, మందం, అంచులు కలిగిన బ్యాట్లను ఆటగాళ్లు ఉపయోగించకుండా అడ్డుకోవడమే ఈ విధానం లక్ష్యం. ఇందుకోసం అంపైర్లు ప్రత్యేకంగా రూపొందించిన మెటల్ గేజ్ పరికరాన్ని ఉపయోగించనున్నారు. బ్యాటర్లు క్రీజులోకి వచ్చిన సమయంలోనే బ్యాట్‌ను ఈ పరికరం ద్వారా పరిశీలించే అవకాశం ఉంది. ఇటీవల ఐపీఎల్‌లో అమలు చేసిన ఈ విధానం మంచి ఫలితాలను ఇచ్చింది. నిబంధనలకు విరుద్ధమైన బ్యాట్ల వినియోగాన్ని అడ్డుకునేందుకు అంపైర్లకు ఉపయోగపడింది. ఇదే విధానాన్ని అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అమలు చేయడం ద్వారా బ్యాటర్లు, బౌలర్ల మధ్య సమతుల్యతను కాపాడాలని ఐసీసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బౌల్ట్ స్థానంలో అర్ష్‌దీప్ సరైనోడే: ఇర్ఫాన్ పఠాన్



ఈవార్తలు, క్రీడావాణి: ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ తీసుకున్న నిర్ణయాలపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చిన నేపథ్యంలో న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్‌ను వదులుకోవడం సరైన నిర్ణయమేనని అభిప్రాయపడ్డాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ యువ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను విడుదల చేయడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నాడు. జియోస్టార్‌తో మాట్లాడిన పఠాన్.. విదేశీ లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ బౌల్ట్ స్థానంలో భారత లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ జట్టులోకి రావడం ముంబైకి కలిసొచ్చే అంశమని తెలిపాడు. దీంతో తుది జట్టులో విదేశీ ఆటగాళ్ల ఎంపిక విషయంలో మరింత వెసులుబాటు లభిస్తుందని వివరించాడు. తరచూ గాయాల బారిన పడుతూ పూర్తి సీజన్ ఆడలేకపోతున్న దీపక్ చాహర్‌ను విడుదల చేయడాన్ని కూడా పఠాన్ సమర్థించాడు. కొత్త బంతితో వికెట్లు పడగొట్టే బౌలర్ ఇప్పటికే జట్టులో ఉన్నప్పుడు చాహర్‌ను పక్కనపెట్టడాన్ని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నాడు. అయితే మిచెల్ శాంట్నర్‌తో కలిసి స్పిన్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఘజన్‌ఫర్ ఉపయోగపడేవాడని అభిప్రాయపడ్డాడు. అతడిని విడుదల చేయడం మాత్రం ఆశ్చర్యంగా ఉందన్నాడు. ఈ మార్పుల తర్వాత కూడా ముంబై బౌలింగ్ విభాగం పటిష్టంగానే కనిపిస్తోందని పఠాన్ తెలిపాడు. భారీ పర్స్ బ్యాలెన్స్‌తో మినీ వేలానికి వెళ్తున్న ముంబై ఇండియన్స్ కొత్త ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తుందన్న నమ్మకం వ్యక్తం చేశాడు. ఈసారి వేలంలో అందుబాటులో ఉన్న నిధులను ఫ్రాంచైజీ ఎలా వినియోగిస్తుందో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు.



మహీ భాయ్ మా స్ఫూర్తి: ఇషాన్

ఈవార్తలు, క్రీడావాణి: భారత క్రికెట్‌కు మహేంద్ర సింగ్ ధోనీ అందించిన సేవలు ఎనలేనివని యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కొనియాడాడు. ఐపీఎల్‌కు ధోనీ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో స్పందించిన ఇషాన్.. యువ క్రికెటర్లకు మహీ భాయ్ గొప్ప స్ఫూర్తిగా నిలిచాడని పేర్కొన్నాడు. సరైన సమయంలోనే ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడని అభిప్రాయపడ్డాడు. పాట్నాలో విలేకరులతో మాట్లాడిన ఇషాన్.. రిటైర్మెంట్‌కు సమయం ఆసన్నమైందని ధోనీ భావించి ఉంటాడని చెప్పాడు. అతడు ఇకపై ఆడబోడనే బాధ కంటే, దేశానికి అందించిన సేవలను, యువ ఆటగాళ్లకు ఇచ్చిన స్ఫూర్తిని గుర్తుంచుకోవడం ముఖ్యమని తెలిపాడు. ధోనీ సాధించిన విజయాలు ఎంతోమందికి ఆనందాన్ని అందించాయని, అతడిలా దేశానికి సేవ చేసిన ఆటగాళ్లు చాలా కొద్దిమందేనని పేర్కొన్నాడు. ధోనీ, ఇషాన్ కిషన్ ఇద్దరికీ జార్ఖండ్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. పాట్నాలో జన్మించిన ఇషాన్ చిన్నతనంలోనే రాంచీకి వెళ్లి ఝార్ఖండ్ తరఫున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ధోనీ తన చిన్ననాటి అభిమాన క్రికెటర్ అని, అతడి అడుగుజాడల్లో నడవాలని కోరుకున్నట్లు గతంలో పలుమార్లు వెల్లడించాడు. 18 ఏళ్ల వయసులో తన బ్యాట్‌పై ధోనీ ఆటోగ్రాఫ్ తీసుకున్న విషయాన్ని, ఝార్ఖండ్ జట్టు నెట్ సెషన్లలో అతడి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్న సందర్భాలను గుర్తుచేసుకున్నాడు. 2008లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించిన ధోనీ ఐదుసార్లు జట్టుకు ట్రోఫీ అందించాడు. కాలి కండరాల గాయం కారణంగా 2026 సీజన్‌కు దూరమైన ధోనీ, 2027 సీజన్ నుంచి చెన్నై జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించింది.



వైభవ్ బ్యాటు తాండవం

52 బంతుల్లోనే డబుల్ సెంచరీ.. 28 సిక్సర్లతో విధ్వంసం

53 బంతుల్లో 204 పరుగులు.. లిస్ట్-ఎ క్రికెట్‌లో రికార్డుల మోత

భారత టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బ్యాట్‌తో విశ్వరూపం ప్రదర్శించాడు. దోహా వేదికగా జరుగుతున్న ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో సిక్సర్ల సునామీ సృష్టించాడు. కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్.. 53 బంతుల్లో 204 పరుగులు సాధించి లిస్ట్-ఎ క్రికెట్‌లో పలు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టాడు.

ఈవార్తలు, క్రీడావాణి: 250 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 'ఎ' జట్టుకు వైభవ్ మెరుపు ఆరంభం ఇచ్చాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే యూఏఈ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. 16 బంతుల్లో హాఫ్ సెంచరీ, 28 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత 40 బంతుల్లో 150 పరుగుల మార్కును అందుకున్నాడు. అదే దూకుడును కొనసాగిస్తూ 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ సాధించాడు.

28 సిక్సర్లతో ప్రపంచ రికార్డు

ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా 28 సిక్సర్లు బాదిన వైభవ్ ప్రొఫెషనల్ క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. 2024 రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ నమోదు చేసిన 26 సిక్సర్ల రికార్డును అధిగమించాడు. కొలిన్ మన్రో, డార్సీ షార్ట్ పేరిట ఉన్న 23 సిక్సర్ల మైలురాళ్లను కూడా దాటేశాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో 103 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించిన చాడ్ బోవ్స్ రికార్డును వైభవ్ బద్దలు కొట్టాడు. వేగవంతమైన సెంచరీ, 150 పరుగులు, డబుల్ సెంచరీ రికార్డులను ఒకే మ్యాచ్‌లో సొంతం చేసుకున్నాడు. అతడి విధ్వంసంతో భారత్ 'ఎ' కేవలం ఐదు ఓవర్లలోనే 100 పరుగుల మార్కును అందుకుంది.

హర్‌ప్రీత్ సెంచరీ వృథా

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఆరంభంలోనే 20 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన యూఏఈని హర్‌ప్రీత్ సింగ్ భాటియా ఆదుకున్నాడు. 144 బంతుల్లో 12 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 130 పరుగులు సాధించాడు. మహ్మద్ షహదాద్ (28), ఏతాన్ డిసౌజా (25), బాసిల్ హమీద్ (36 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌ద్ ఖాన్ పది ఓవర్లలో 43 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. హర్షిత్ రాణా, సూర్యాన్ష్ షెడ్గే, హర్ష్ దూబే, షహబాజ్ అహ్మద్ తలో వికెట్ తీశారు. లక్ష్యఛేదనలో వైభవ్ సూర్యవంశీ 204 పరుగులతో చెలరేగగా, అభిషేక్ శర్మ (12), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (3) తక్కువ పరుగులకే వెనుదిరిగారు. అనంతరం రింకూ సింగ్ (27 నాటౌట్), కుమార్ కుశాగ్ర (1 నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. దీంతో భారత్ 'ఎ' కేవలం 14.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది.

గిల్ విజ్ఞప్తికి ఐసీసీ నో

ఈవార్తలు, క్రీడావాణి: అంతర్జాతీయ క్రికెట్‌లో బంతికి ఉమ్మి రాయడంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలన్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విజ్ఞప్తికి సానుకూల స్పందన లభించలేదు. ఆరోగ్య కారణాలతోపాటు క్రీడాస్ఫూర్తికి సంబంధించిన అంశాలను దృష్టిలో పెట్టుకుని నిషేధాన్ని కొనసాగించనున్నట్లు ఐసీసీ వర్గాలు 'ఇండియా టుడే'కు వెల్లడించాయి. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసిన అనంతరం గిల్ ఈ అంశాన్ని ప్రస్తావించాడు. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై కూకబుర్రా బంతులు త్వరగా మెత్తబడుతున్నాయని, దీంతో బౌలర్లు వికెట్లు తీయడం కష్టమవుతోందని పేర్కొన్నాడు. బంతికి ఉమ్మి రాసేందుకు అనుమతిస్తే బౌలర్లకు కొంత ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డాడు. కొవిడ్ మహమ్మారి నేపథ్యంలో 2020లో ఆటగాళ్ల ఆరోగ్య పరిరక్షణ కోసం బంతికి ఉమ్మి రాయడంపై తాత్కాలిక నిషేధం విధించారు. ఆ తర్వాత దానిని శాశ్వత నిబంధనగా మార్చారు. మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నిబంధనల ప్రకారం కూడా బంతి స్వరూపాన్ని మార్చేందుకు ఉమ్మిని ఉపయోగించడం అనుచిత ప్రవర్తన కిందకు వస్తుంది. ఉమ్మి వినియోగాన్ని పర్యవేక్షించడం కష్టమని, స్వీట్లు, చూయింగ్ గమ్ వంటి పదార్థాలతో కలిపి బంతికి రాయడం ద్వారా అక్రమంగా ప్రయోజనం పొందే ప్రమాదం ఉందని ఐసీసీ భావిస్తోంది. ఆటగాళ్లు, అంపైర్ల ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలు కూడా ఉన్నట్లు సమాచారం.



ఐపీఎల్‌లో మాత్రం అనుమతి

ఐపీఎల్ 2025 సీజన్ నుంచి బంతికి ఉమ్మి రాయడంపై నిషేధాన్ని ఎత్తివేశారు. అయితే దేశీయ టోర్నీలో తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయ క్రికెట్ నిబంధనలకు వర్తించదు. ఐసీసీ నిబంధనల్లో మార్పు తీసుకురావాలంటే సభ్య దేశం సంబంధిత కమిటీ ద్వారా ప్రతిపాదన చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ నిషేధాన్ని ఎత్తివేయడంపై ఎలాంటి చర్చలు జరగడం లేదని ఐసీసీ వర్గాలు వెల్లడించాయి.

దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ కెప్టెన్ ప్రియాంశ్ ఆర్య పరుగుల సునామీ సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా ఇండోర్‌లోని డాలీ కాలేజ్ మైదానంలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 68 బంతుల్లో 19 సిక్సర్లు, ఏడు ఫోర్లతో 181 పరుగులు సాధించి టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

ఈవార్తలు, క్రీడావాణి: ఓపెనర్‌గా బరిలోకి దిగిన ప్రియాంశ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 18 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతడు 36 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఆ తర్వాత కూడా ఏమాత్రం జోరు తగ్గించకుండా సిక్సర్ల మోత మోగించాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో మణిమారన్ సిద్ధార్థ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.



ప్రియాంశ్ సిక్సర్ల సునామీ

68 బంతుల్లో 181 పరుగులు.. 19 సిక్సర్లు, 7 ఫోర్లు

టీ20ల్లో భారత బ్యాటర్ అత్యధిక స్కోరు.. ప్రపంచ రికార్డు సమం

రాహుల్ రికార్డు బద్దలు

టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత బ్యాటర్‌గా ప్రియాంశ్ రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కేఎల్ రాహుల్ సాధించిన 152 పరుగుల రికార్డును అధిగమించాడు. టీ20 క్రికెట్ చరిత్రలో రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు. దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ లువాన్ డ్రే ప్రిటోరియస్ 188 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఒకే ఇన్నింగ్స్‌లో 19 సిక్సర్లు బాదడం ద్వారా న్యూజిలాండ్ బ్యాటర్ ఫిన్ అలెన్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును ప్రియాంశ్ సమం చేశాడు.

ఢిల్లీ ఘన విజయం

ప్రియాంశ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 275 పరుగుల భారీ స్కోరు చేసింది. ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో ఇది మూడో అత్యధిక జట్టు స్కోరు. అనంతరం లక్ష్యఛేదనలో తమిళనాడు 159 పరుగులకే పరిమితం కావడంతో ఢిల్లీ 116 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.



ఈవార్తలు
ప్రజావాణి
బుధవారం 25-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

హస్తానికి ఎస్పీ కొలత

ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లో ఎవరికి టికెట్ ఇవ్వాలో తేల్చిన కాంగ్రెస్, ఇప్పుడు తనకెన్ని టికెట్లు దక్కుతాయో తెలుసుకోవడానికి సమాజ్‌వాదీ పార్టీ వైపు చూస్తోంది. 403 స్థానాలున్న యూపీ అసెంబ్లీలో కనీసం వంద సీట్లు కావాలన్నది కాంగ్రెస్ డిమాండ్. ఎస్పీ చర్చలకు తెచ్చిన జాబితాలో ఉన్నవి 26! ఆ జాబితాను కాంగ్రెస్‌కు ఇచ్చామని ఎస్పీ ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ యాదవే చెప్పారు. ముప్పైకి కూడా చేరని ఈ ప్రతిపాదనపై ఇంకా బేరం సాగుతోంది. రేపు సంఖ్య పెరగొచ్చు. కానీ తొలి జాబితాతోనే అఖిలేశ్ యాదవ్ ఓ విషయం తేల్చేశారు. యూపీలో కాంగ్రెస్ తనకిచ్చుకునే విలువ వేరు, దాని మిత్రపక్షం కట్టే విలువ వేరు. 'మేం సీట్లు అడుక్కోవడం లేదు' అని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ అనాల్సి వచ్చింది. ఆ మాటలో ఆవేదన అర్థమవుతుంది. కానీ కాంగ్రెస్ నాయకత్వం సమాధానం చెప్పాల్సిన ప్రశ్న మరొకటి ఉంది. తాము కోరుతున్న వంద స్థానాల్లో కనీసం కొన్నింటి విషయంలోనైనా 'ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెడితేనే గెలుస్తాం' అని ఎస్పీ పట్టుబట్టే పరిస్థితి ఎందుకు రాలేదు? అలాంటి నియోజకవర్గాలను పెంచుకుని ఉంటే, సీట్ల పంపకం కోసం ఢిల్లీ దాకా వెళ్లినా పార్టీ గౌరవం గురించి ఇంతగా మాట్లాడాల్సిన అవసరం ఉండేది కాదు. అఖిలేశ్ బేరం వెనుక పాత లెక్క ఒకటుంది. 2017లో ఇదే ఎస్పీతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్ 114 స్థానాల్లో అభ్యర్థులను నిలిపి, గెలిచింది ఏడింట్లోనే. అంటే ఇప్పుడు కోరుతున్న వంద కంటే ఎక్కువ సీట్లలోనే అప్పట్లో అవకాశం దక్కింది. ఆ అవకాశాన్ని ఓట్లుగా మార్చుకోలేకపోయింది. 2022లో విడిగా బరిలోకి దిగితే మిగిలింది ఇద్దరు ఎమ్మెల్యేలు. మరి ఈసారి వంద సీట్లలో పోటీ చేస్తే ఫలితం ఎలా మారుతుంది? ఏ జిల్లాలో కొత్త నాయకత్వం ఎదిగింది? ఏ నియోజకవర్గంలో ప్రజల తరఫున నిలబడి పార్టీ మళ్లీ నమ్మకం సంపాదించింది? ఈ ప్రశ్నలకు స్థానాల పేర్లతో సహా జవాబు చెప్పగలిగినప్పుడే కాంగ్రెస్ డిమాండ్‌కు బరువు పెరుగుతుంది. కాంగ్రెస్ దగ్గరా చెప్పుకోదగ్గ లెక్క ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో పోటీ చేసిన 17 స్థానాల్లో ఆరింటిని గెలుచుకుంది. ఎస్పీకి 37 వచ్చాయి. ఈ ఫలితాన్ని చూపించి తమ వాటా పెంచాలని కాంగ్రెస్ కోరడంలో అర్థముంది. అదే ఫలితంతో వంద అసెంబ్లీ సీట్లకు హక్కు వచ్చిందనుకోవడంలోనే పేచీ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థికి పడిన ఓటుపై రెండు పార్టీలకూ హక్కుంది. ఆరు విజయాలూ సొంత బలమేనని కాంగ్రెస్ లెక్కేసుకుంటే, ఆ 37 విజయాల్లో కాంగ్రెస్ ఓటరు పాత్ర ఏమిటన్న ప్రశ్న ఎస్పీకీ ఎదురవుతుంది. పొత్తు ఇద్దరికీ మేలు చేసింది. ఆ మేలును అసెంబ్లీ నియోజకవర్గాల్లో సొంత బలంగా ఎంతవరకు మలుచుకుందన్నదే ఇప్పుడు కాంగ్రెస్‌కు పరీక్ష. ప్రతి జిల్లాలోనూ దాదాపుగా ఒక స్థానమైనా దక్కాలన్నది కాంగ్రెస్ ఆలోచన. పార్టీని బతికించుకోవాలంటే కార్యకర్తకు తన గుర్తుపై పోటీ చేసే అవకాశం కావాలి. ఆ బాధ కాంగ్రెస్‌ది. కానీ అక్కడ ఏళ్ల తరబడి పనిచేసి టికెట్ ఆశిస్తున్న తన నాయకుడిని పక్కనపెట్టి, కాంగ్రెస్‌కు సీటిస్తే కూటమికి కలిసొచ్చేదేమిటన్నది అఖిలేశ్ లెక్క. ఈ రెండింటి మధ్య తేడాను ఢిల్లీలో కూర్చుని భర్తీ చేయలేరు. ఎన్నికలు లేని రోజుల్లో రైతు సమస్యపై తహసీల్దార్ కార్యాలయం దగ్గర నిలబడిన నాయకుడెవరో, ఉద్యోగాల కోసం తిరిగే యువతకు అందుబాటులో ఉన్నదెవరో అక్కడి జనానికి తెలుసు. అలాంటి నాయకుడు కాంగ్రెస్‌లో ఉంటే ఆ సీటు కోసం ఎస్పీతో మాట్లాడటం తేలిక. టికెట్ ఖరారయ్యాక నాయకుడిని వెతుక్కుందామంటేనే కాళ్లబేరం తప్పదు. చివరికి 26 కాస్తా నలభై కావచ్చు, అంతకంటే ఎక్కువా రావచ్చు. వాటినే ఢిల్లీ నాయకత్వం తన దౌత్య విజయంగా చెప్పుకోవచ్చు. కానీ యూపీ కాంగ్రెస్ కార్యకర్తకు కావాల్సిన విజయం అది కాదు. తన నియోజకవర్గంలో పార్టీ కోసం ఐదేళ్లు పనిచేస్తే, ఎన్నికల వేళ తన భవితవ్యాన్ని మిత్రపక్షం దయకు వదిలేయదన్న నమ్మకం కావాలి.

అధికారానికి తలవంచని అక్షరం..!

"పలు ప్రభుత్వాలు పలుమార్లు నన్ను రమ్మని కబురు పంపించాయి. సముద్రం మీరు రమ్మన్న చోటికి రాదని తెలుసుకున్నాయి." యక్కలూరి శ్రీరాములు ఆత్మగౌరవం ఈ మాటల్లో వినిపిస్తుంది. కవిగా, కథకుడిగా, నవలా రచయితగా, నాటకకర్తగా, వ్యాసకర్తగా ఆయన ఎంచుకున్న ప్రక్రియలు వేరు. వాటిలో ఆయన అడిగే ప్రశ్నలకు మూలం మాత్రం ప్రజల జీవితమే. సంక్షేమ పథకం అర్హులకు చేరిందా? రాజ్యాంగం ఇచ్చిన హక్కును సామాన్యుడు వినియోగించుకోగలుగుతున్నాడా? పాలనలో నిర్లక్ష్యానికి ఎవరు జవాబు చెబుతారు? ఇలాంటి ప్రశ్నలకు శ్రీరాములు తన రచనల్లో చోటిస్తారు. అణగారిన వర్గాల ఆవేదనను పాఠకుల ముందుంచుతారు. ప్రజా పరిపాలనకు ప్రణాళికలు రూపొందించేటప్పుడూ ఆయనది ఇదే దృష్టి. రైతు కష్టం, ఉద్యోగం కోసం యువత ఎదురుచూపు, పేద కుటుంబం పడే ఇబ్బందులు పాలకుల నిర్ణయాల్లో ప్రతిఫలించాలి. అభివృద్ధి ఎంత జరిగిందో చెప్పేది ఆ కుటుంబాల జీవితాల్లో వచ్చిన మార్పే. ప్రజల తరఫున రచయిత అడిగే ప్రశ్న ఒక్కోసారి పాలకులకు ఇబ్బంది కలిగించవచ్చు. అవినీతిని ఎత్తిచూపినప్పుడు దాన్ని వ్యక్తిగత విమర్శగా తీసుకుంటే, చర్చంతా ప్రశ్న అడిగినవారి చుట్టూ తిరుగుతుంది. అసలు సమస్య అక్కడే మిగిలిపోతుంది. విమర్శను విని, లోపాన్ని సరిదిద్దే చొరవలోనే పాలకుల పరిణతి కనిపిస్తుంది. అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఎంత అవసరమో శ్రీరాములు రచనా వైఖరి గుర్తుచేస్తుంది. పాలకులు మారుతారు. ప్రజల పక్షాన నిలిచిన మాట మిగులుతుంది. సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలుచుకుంటున్న యక్కలూరి శ్రీరాములుకు హృదయపూర్వక అభినందనలు. సముద్రం రమ్మంటే రాదు.. సత్యం చెప్పే అక్షరం తలవంచదు!



శ్రీనివాస్ జీడిపల్లి,
సామాజిక రచయిత, తూప్రాన్



సానుభూతే కాంగ్రెస్ దిక్కా?

రాజీవ్ గాంధీని కోల్పోయిన రోజు తమ ఇంట్లో ఏం జరిగిందో సోనియా చెబితే దేశం వింటుంది. ఆ రోజు తల్లిని ఎలా చూశారో రాహుల్, ప్రియాంక చెబితే చలిస్తుంది. కానీ అదే పౌరుడు ఓటు వేసే రోజున తన ఇంటి సంగతి కూడా ఆలోచిస్తాడు. చదువు పూర్తయిన బిడ్డకు ఉద్యోగం ఎప్పుడొస్తుంది? పండించిన పంట అమ్ముకోవడానికి ఇంకెన్ని రోజులు మార్కెట్ యార్డులో పడిగాపులు కాయాలి? గాంధీ కుటుంబం బాధను అర్థం చేసుకున్నంత మాత్రాన తన బాధను కాంగ్రెస్ అర్థం చేసుకుందని అతనికి ఎలా నమ్మకం కలుగుతుంది? సోనియా గాంధీ తన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో కుటుంబ జీవితాన్ని, ప్రేమను, ఆత్మీయులను కోల్పోయిన వేదనను రాశారు.

నవంబరు 24న రాహుల్ తన యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేసిన వీడియోలో సోనియా, ప్రియాంకతో కలిసి పుస్తకంలో చోటుచేసుకోని విషయాలను ప్రస్తావించారు. ఆ మాటల్లో రాహుల్ ఒక తీవ్రమైన ఆరోపణ చేశారు. తన తండ్రి హత్యకు గురయ్యేలా ఉద్దేశపూర్వకంగానే ఆయన భద్రతను తొలగించారనేది రాహుల్ వాదన. సోనియా పుస్తకంపై మొదలైన చర్చకు ఆ ఒక్క మాటతో మరో అర్థం వచ్చింది. తండ్రికి ఎదురైన ముప్పు గురించి కొడుకుగా రాహుల్‌కు ఉన్న ఆవేదనను అర్థం చేసుకోవచ్చు. అయితే లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆయన మాటకు ప్రత్యేకమైన బరువు ఉంది. అప్పటి భద్రతా ఏర్పాట్లలో లోపం జరిగిందన్న వాదన ఒకటి. హత్య జరగాలనే ఉద్దేశంతోనే భద్రత తొలగించారన్న ఆరోపణ మరొకటి. రెండో మాట అన్నప్పుడు ఆ నిర్ణయం ఎవరు తీసుకున్నారు, వారి ఉద్దేశాన్ని నిర్ధారించే ఆధారాలేమిటి అన్న ప్రశ్నలు వస్తాయి. వాటిని దేశం ముందుంచితే జవాబుదారీతనంపై చర్చ మొదలవుతుంది. ఆ పని చేయకుండా కుటుంబ సంభాషణలో అంత పెద్ద ఆరోపణను వదిలేస్తే చివరకు ప్రజలకు మిగిలేది ఆనాటి విషాదమే.

సోనియా తన జీవిత కథ రాసుకోవడానికి రాజకీయ సమర్థన అక్కర్లేదు. కాంగ్రెస్ తీరుపై ప్రశ్న మొదలయ్యేది ఆ కథను ప్రజల ముందుకు తీసుకెళ్తున్న విధానం దగ్గర. పుస్తకావిష్కరణలో తండ్రి మరణం తర్వాత తల్లి జీవితంలో వచ్చిన మార్పును రాహుల్ గుర్తుచేశారు. కొద్ది రోజులకే తన రాజకీయ అభిప్రాయాలను లక్షల మందికి చేరవేసే వేదికపైనా అదే కుటుంబ కథను ముందుకు తెచ్చారు. ఏ జ్ఞాపకాన్ని ఎప్పుడు, ఏ వేదిక మీద చెప్పాలన్నది కూడా ఒక రాజకీయ ఎంపికే. కుటుంబానికి జరిగిన అన్యాయం గురించి ప్రజల్లో ఉన్న సానుభూతి, పార్టీ నాయకత్వంపై నమ్మకంగా మారుతుందనే లెక్క ఇందులో కనిపిస్తోంది. ఆ లెక్కలో కాంగ్రెస్ మరిచిపోతున్నది తన సొంత కార్యకర్తనే. ఊరిలో ఒక నాయకుడు ఏళ్ల తరబడి రైతులతో కలిసి తిరుగుతాడు. మరొకరు నిరుద్యోగుల సమస్యను భుజాన వేసుకుంటారు. అలాంటి వారికి జాతీయ వేదిక మీద చోటు దొరికితే, వాళ్ల అనుభవం పార్టీ విధానంలో కనిపిస్తే, కాంగ్రెస్‌లో తనకూ దారి ఉందని కిందిస్థాయి కార్యకర్త భావిస్తాడు. ఢిల్లీలో మాత్రం చర్చ మళ్లీ మళ్లీ ఒకే కుటుంబం చుట్టూ తిరిగితే అతనికి అందే సందేశం ఏమిటి? జెండా మోసే బాధ్యత అందరిదీ, పార్టీ కథ చెప్పే హక్కు మాత్రం కొందరిదే అనిపించదా? వారసత్వ రాజకీయాల విమర్శకు ప్రత్యర్థులు కొత్త వాదన వెతుక్కోవాల్సిన అవసరం కాంగ్రెస్ తానే లేకుండా చేస్తోంది. ప్రజలను మెప్పించడానికి కాంగ్రెస్‌కు దారులు చాలానే ఉన్నాయి. తాను పాలిస్తున్న రాష్ట్రాల్లో ఇచ్చిన హామీల్లో ఏవి నెరవేర్చిందో, ఏవి ఆలస్యమయ్యాయో, ఎందుకు ఆలస్యమయ్యాయో చెప్పొచ్చు. కేంద్రాన్ని నిలదీసే అంశంపై తన చేతిలో అధికారం ఉన్నచోట ఏం చేసిందో చూపొచ్చు. కుటుంబంతో కూర్చుని పాత సంగతులు మాట్లాడినంత తీరికగా రైతులతో, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతతో కూర్చుని, వాళ్లు వేసే ఇబ్బందికరమైన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వొచ్చు. అలాంటి సంభాషణలో నాయకత్వం మీద నమ్మకం పుడుతుంది. దానికి కష్టపడాలి. సానుభూతి అంతకంటే తేలికగా లభిస్తుంది. కాంగ్రెస్ ముందున్న ప్రలోభం అదే. రాజీవ్ గాంధీ హత్య ఈ దేశ చరిత్రలో ఒక గాయం. ఆ గాయం పట్ల ప్రజలకున్న గౌరవాన్ని రాజకీయ మద్దతుగా జమ వేసుకోవడం కాంగ్రెస్ పొరపాటు. సోనియా పుస్తకం చదివిన పౌరుడు చివరి పేజీ మూసిన తర్వాత తన బతుకులోకే తిరిగి వెళ్తాడు. ఆ బతుకు గురించి కాంగ్రెస్ ఏం చెబుతుంది? వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పును నిర్ణయించేది ఆ ప్రశ్నకు దొరికే సమాధానమే.



శశిధర్ అక్కెల

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.